www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి మా అక్షరం-మీ ఆయుధం తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4 సంచిక -23 గురువారం 7 మే 2026 ఎడిటర్ : మారేపల్లి అశోక్ పేజిలు -8 వెల - 3/- 01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts

## కాంగ్రెస్‌కు పిండం పెడితేనే..

# రైతులకు న్యాయం

**రైతు డిక్లరేషన్ ..ఓ బోగస్ పత్రం**

**రైతులను వంచించిన రేవంత్, రాహుల్**

**రైతు భరోసా ఎకరాకు 15 వేలు ఎందుకు ఇవ్వడం లేదు**

**రైతుకూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైంది**


**కరోనా కన్నా డేంజర్ కాంగ్రెస్ పార్టీ**

**బిఆర్ఎస్ హయాంలో ఠంచనుగా రైతుభరోసా ఇచ్చాం**

**రైతు సంగ్రామ సదస్సులో కెటిఆర్ విమర్శలు**



**వరంగల్,మే 6(ప్రజావినికిడి):** రైతు డిక్లరేషన్ అనేది ఒక బోగస్ పత్రమని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. డిక్లరేషన్ పేరిట రైతులకు చిత్తు కాగితం ఇచ్చి మోసం చేశారని మండిపడ్డారు. డిక్లరేషన్ ఇచ్చిన రాహుల్ గాంధీ, మిగతా 2లో...



## హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం

2లో.

**కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో ప్రాజెక్ట్**

**-ఫేజ్-3కింద ఎయిర్‌పోర్ట్-ఫ్యూచర్ సిటీ కారిడార్**

**కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి**

## విత్తన సరఫరా వేగంగా చేయాలి

**: చంద్రబాబునాయుడు**

**మదనపల్లెలో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్**

**పంటలకు ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా అధిక ఆదాయం**

**వ్యవసాయ, ఉద్యాన పంటల కొనుగోళ్ల అంశంపై సీఎం చంద్రబాబు సమీక్ష**



**అమరావతిమే 6(ప్రజావినికిడి):**
ఈ ఏడాది మే 15 నుంచే రైతులకు సాగునీరు అందించనున్న దృష్ట్యా రాష్ట్రంలో వేగంగా విత్తన సరఫరా చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వ్యవసాయ శాఖకు దిశానిర్దేశం చేశారు. విత్తనాల సరఫరా కోసం రూ.200 కోట్లు కేటాయించాలని ఆయన ఆదేశాలు జారీ చేశారు. సచివాలయంలో బుధవారం రాష్ట్రంలో ధాన్యం, అరటి, పొగాకు, ఆయిల్ పామ్ తదితర పంటల కొనుగోళ్లపై ముఖ్యమంత్రి వ్యవసాయ, ఉద్యాన శాఖలతో సమీక్ష నిర్వహించారు.మిగతా 2లో...

# మెజారిటీతో రండి

**విజయ్‌కు గవర్నర్ షాక్**

**118 మంది ఎమ్మెల్యే మద్దతు తప్పనిసరి**

**మద్దతు ఇచ్చే పార్టీల లేఖలు అవసరమని సూచన**

**పూర్తి మెజార్టీ ఉంటే ప్రభుత్వ ఏర్పాటుకు అవకాశం**

**గవర్నర్ విశ్వనాథ్‌తో భేటీలో విజయ్‌కు స్పష్టీకరణ**

**నేటి ప్రమాణ స్వీకారంపై సందిగ్ధత**



**చెన్నై,మే 6(ప్రజావినికిడి):**
టీవీకే చీఫ్ విజయ్‌కు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ షాక్ ఇచ్చారు. తగినంత మెజారిటీ చూపించలేకపోవడంతో విజయ్ ప్రభుత్వం ఏర్పాటుకు గవర్నర్ అనుమతి నిరాకరించారు. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేలు తప్పనిసరని గవర్నర్ స్పష్టం చేశారు. దీంతో తక్షణం ప్రభుత్వం ఏర్పాటుపై సస్పెన్స్ కొనసాగుతోంది. మద్దతు ఎమ్మెల్యేలు లేదా పార్టీల జాబితా సమర్పించాలని, అప్పుడే ప్రభుత్వ ఏర్పాటుకు ఆహ్వానం పలుకుతామని స్పష్టం చేసినట్లు సమాచారంమిగతా 2లో...

## ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

**ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను బొందపెట్టే జీవో 7**

**హెచ్‌పీఎస్‌లో అవినీతి చర్యలేవీ? : కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్(ప్రజావినికిడి):**
విద్యా సంవత్సరం ప్రారంభం కాకముందే మే నెలలోనే ఫీజుల నియంత్రణ చట్టం తేవాలని తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. బుధవారం హైదరాబాద్ స్కూల్స్ పేరెంట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లోని సోమాజీ గూడ ప్రెస్‌క్లబ్‌లో నాణ్యమైన విద్య ఫీజుల నియం త్రణపై జరిగిన రౌండ్ టేబుల్ సమావేశానికి

## ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

**హైదరాబాద్ మే 6(ప్రజావినికిడి):**
ధాన్యం కొనుగోళ్ల అం శంపై విపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నాయని మంత్రి ఉత్త మ్ కుమార్ రెడ్డి మండిపడ్డారు. బుధవారం ఆయన సచివాలయంలో విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలోనే రాష్ట్రంలో రికార్డ్ స్థా యిలో ధాన్యం దిగుబడి అయ్యిందని, దేశంలోనే రికార్డ్ స్థాయిలో దిగుబడి ,కొనుగోళ్లు జరిపింది రాష్ట్రంలోనే అని మంత్రి స్పష్టం చేశారు. మిగతా 2లో...



## ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం

**విధులకు ఏళ్లుగా గౌర్హాజరు**

**-51 మందిపై వేటు వేసిన ప్రభుత్వం**

**క్రమశిక్షణా రాహిత్యాన్ని ఉపేక్షించేది లేదన్న మంత్రి సత్యకుమార్**

**అమరావతి,మే 6(ప్రజావినికిడి):**
ప్రభుత్వ ఆసుపత్రుల్లో క్రమశిక్షణ, రోగులకు మెరుగైన వైద్య సేవలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. అనధికారికంగా విధులకు గైర్హాజరవుతున్న వైద్యుల పట్ల రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్మిగతా 2లో...



## 'ప్రాజెక్ట్ ఫ్రీడమ్'ను నిలిపివేసిన ట్రంప్

**ఇరాన్‌తో చర్చల్లో పురోగతి**

**అందుకే ఈ నిర్ణయమన్న ట్రంప్**

**ఇరాన్‌పై దిగ్బంధనం మాత్రం కొనసాగుతుందని స్పష్టీకరణ**

**ఇరాన్ సైనిక శక్తిని పూర్తిగా దెబ్బతీశామని వ్యాఖ్య**



2లో.



## 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

**సిఎం అభ్యర్థిపై బిజెపిలో సమాలోచనలు -ప్రమాణస్వీకారానికి భారీగా ఏర్పాట్లు**

**కోల్‌కతామే 6(ప్రజావినికిడి):**
పశ్చిమ బెంగాల్‌లో స్పష్టమైన ఆధిక్యం సాధించడంతో భారతీయ జనతా పార్టీ కొత్త ప్రభుత్వ ఏర్పాటుకు సన్నాహాలు చేస్తుంది. ముఖ్యమంత్రిగా ఎవరు బాధ్యతలు చేపట్టనున్నారనే అంశంపై పలువురి పేర్లు తెరపైకి వచ్చాయి. వారిలో ఒకరిని ఎంపిక చేసేందుకు ఆ పార్టీ అగ్ర నాయకత్వం రాష్ట్రానికి చెందిన కీలక నేతలతో వరుసగా చర్చలు జరుపుతోంది. దీనిపై కసరత్తు జరుగుతుండగానే 9న ప్రమాణ స్వీకార ఏర్పాట్లు సాగుతున్నారు. బెంగాల్ నేత ఎంపికకు పరిశీలకుడిగా కేంద్రహోంమంత్రి అమిత్ షా రానున్నారు. అందుకే మే 9వ తేదీ శనివారం ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార మిగతా 2లో...

# ఫీజుల నియంత్రణ చట్టం తేవాలి

**మొదటిపేజీ తరువాయి**

ఎంవీ ఫౌండేషన్ కన్వీనర్ వెంకట్ రెడ్డి అధ్యక్షత వహించారు. ఆమె మాట్లాడారు. ప్రయివేటు విద్యా సంస్థల దోపిడీ, హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో అవినీతి పై ప్రభుత్వం స్పందించాలని కోరారు. విద్యాశాఖ మంత్రి కూడా సీఎం కావడం మన ఖర్మ అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఏడాది ఒక్క రూపాయి పెంపు లేకుండా జీవో జారీ చేయాలని కోరారు. ప్రయివేటు పాఠశాలల్లో దాదాపు 50 నుంచి 120 శాతం వరకు ఫీజులు పెంచుతున్నార ని మండిపడ్డారు. ఈ విషయంలో ప్రభుత్వం వెంటనే స్పందించకపోతే ఉద్యమం తప్పదని హెచ్చరించారు. త్వరలోనే తమతో కలిసి వచ్చే అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని కలెక్టరేట్ల వద్ద ఆందోళన చేస్తామని ఆమె హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని పూర్తి గా నిలిపేసేందుకు ప్రభుత్వం కుట్ర చేస్తోందని కవిత మండిపడ్డారు. ప్రభుత్వం కొత్తగా తెచ్చిన ఎంఎస్ -7 జీవోతో ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మంగళం పాడే ప్రయత్నం చేస్తున్నారన్నారు. ప్రభుత్వం తెచ్చిన జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ లో ఉన్న రూ.11వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలన్నారు. బకాయిల కారణంగా డ్రాపౌట్స్ పెరిగిపోతున్నాయనిఆందోళన వ్యక్తం చేశారు.

హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)లో అడ్డగోలు అవినీతి జరుగుతోందని కవిత ఆరోపించారు. ప్రభుత్వ భూముల్లో, ప్రభుత్వ ఆధ్వర్యంలో కొనసాగు తున్న హెచ్‌పీఎస్ ఈ ఏడాది 120 శాతం ఫీజు పెంచిం దని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రయివేటు కార్పొరేట్ విద్యా సంస్థల్లో పరిస్థితి మరీ దారుణంగా ఉందన్నారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ లో ఒకే వ్యక్తి గత 14 ఏళ్లుగా ఒకటే పదవిలో కొనసాగుతూ కొత్తగా వచ్చే వారికి అవినీతి పాఠాలు నేర్పుతున్నారని ఎద్దేవా చేశారు. సత్య నాదెళ్ల వంటి పూర్వ విద్యార్థులు ఇచ్చిన విరాళాలకు సంబంధించి ఎలాంటి లెక్క పత్రం లేని పరిస్థితి ఉందని విమర్శించారు.

దీనికి తోడు ముఖ్యమంత్రికి అత్యంత సన్నిహితులైన కొందరు ఏకంగా 30 ఎకరాల క్యాంపస్ భూమిని కబ్జా చేసే పనిలో ఉన్నారని ఆరోపించారు. హెచ్‌పీఎస్ పనితీరుపై సమగ్ర సమీక్ష జరిపి, తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబం విద్య, వైద్యం కోసం 70శాతం ఖర్చు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీఆర్ఎస్ అధికారంలోకి వస్తే పేదలకు ఉచిత విద్య, వైద్యం అందిస్తామ ని తెలిపారు. తాను ఇచ్చిన మాటను తప్పితే అమరుల స్థూపం స్తంభానికి కట్టేసి రాళ్లతో కొట్టాలన్నారు.

# మెజారిటీతో రండి : విజయ్‌కు గవర్నర్ షాక్

**మొదటిపేజీ తరువాయి**

. బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను విజయ్ కలుసుకున్నారు. కాంగ్రెస్ మద్దతు ఇచ్చేందుకు ముందుకు వచ్చిందని, పలు పార్టీలుకూడా తమతో చేతులు కలుపనున్నాయని గవర్నర్‌కు విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం అనంతరం అసెంబ్లీలో బలపరీక్ష నిరూపించుకుంటానని విజయ్ వివరించినట్టు తెలుస్తోంది. అయితే విజయ్ వివరణతో గవర్నర్ సంతృప్తి చెందలేదని తెలుస్తోంది. ప్రభుత్వం ఏర్పాటుకు 118 మంది ఎమ్మెల్యేల బలం అవసరం కాగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో కలిసి టీవీకే వద్ద ప్రస్తుతం 112 మంది ఎమ్మెల్యేల బలం ఉంది. విజయ్ రెండు సీట్లలో గెలవడంతో ఒక సీటును వదులుకోవడం అనివార్యం. దీంతో టీవీకే చేతిలో 107 మంది సభ్యుల బలం మాత్రమే ఉన్నట్టయింది. కాంగ్రెస్ బలం కూడా కలిపితే టీవీకే బల నిరూపణకు మరో 6 మంది ఎమ్మెల్యేలు అవసరం. ఐడీఎంకే 47 సీట్లలో గెలవగా, అందులోని ఒకవర్గం టీవీకే వైపు మొగ్గుచూపుతోంది. పీఎంకే-4, ఐయూఎంఎల్-2, సీపీఐ-2, సీపీఎం-2, డీఎండీకే, ఐఎంఎంకే చెరో సీటు కలిగి ఉన్నాయి. టీవీకేకు చిన్న పార్టీల నుంచి మద్దతు లభించే అవకాశాలు బలంగానే ఉన్నాయి. అయితే అధికారికంగా మద్దతు ఇస్తేనే సంఖ్యాబలాన్ని విజయ్ చూపించుకునే అవకాశం ఉంటుంది. టీవీకే అధినేత విజయ్ తమిళనాడు గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్‌ను బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు రాజ్‌భవన్‌లో కలుసుకున్నారు. ప్రభుత్వం ఏర్పాటుకు సంసిద్ధత వ్యక్తం చేశారు. కాగా, తమిళనాడు కొత్త ముఖ్యమంత్రిగా ఈనెల 7వ తేదీన విజయ్ ప్రమాణస్వీకారం చేయడానికి ఏర్పాట్లు కూడా చేసుకున్నారు.. మంచి ముహూర్తం కావడంతో ఉదయం 10 గంటల నుంచి 11.15 గంటల మధ్య విజయ్ ప్రమాణస్వీకారం చేయనున్నారు. ఇందుకోసం చెన్నైలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో పూర్తి స్థాయి ఏర్పాట్లు చేస్తున్నారు. సుమారు 5,000 సీట్ల సామర్థ్యం ఉన్న ఈ స్టేడియంలో ఏర్పాట్లు పూర్తి చేసి ఉదయం గురువారం 6 గంటల కల్లా సిద్ధం చేయనున్నట్టు టీవికే వర్గాలు చెబుతున్నారు. ప్రభుత్వ ప్రమాణస్వీకార కార్యక్రమం కావడంతో స్టేడియం వద్ద పోలీసులు భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

# విత్తన సరఫరా వేగంగా చేయాలి

**మొదటిపేజీ తరువాయి**

ఈ సమీక్షకు మంత్రి కె. అచ్చెన్నాయుడు, వ్యవసాయ, ఉద్యాన శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు. మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా రైతులు పండించే పంటలకు ధరలు దక్కేలా చూడాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ట్రేసబిలిటీ, సర్టిఫికేషన్ ద్వారా పంటలకు మెరుగైన ధర లభించే అవకాశం ఉంటుందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రైతుకు లాభసాటిగా ఉండేలా నాణ్యమైన పంట దిగుబడులు వచ్చేందుకు కృషి చేయాలని సూచించారు

మరిన్ని పంటలను ప్రకృతి సేద్యం విధానంలో సాగు చేస్తే రైతులకు మరింత ప్రయోజనం కలుగుతుందని అన్నారు. సేంద్రీయ సాగుకు కంపోస్టు ఎరువును సరఫరా చేసేలా చూడాలన్నారు. ఈ ఏడాది 42.06 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్న పంట ఉత్పత్తి వస్తుందని అధికారులు వివరించారు. మొక్క జొన్న సహా ఇతర పంటల ద్వారా ఇథనాల్ తయారీకి ఉన్న అవకాశాలను అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు.మామిడిని ప్రాసెసింగ్ యూనిట్లు కొనుగోలు చేసేలా చూడాలని అన్నారు. అరటి, ఆయిల్ పామ్, మిర్చి, కోకో లాంటి పంటలకు సంబంధించి ధరల సమస్య లేదని రైతులకు మంచి ధర లభిస్తోందని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. సీజన్ కంటే ముందే రాష్ట్రంలోని నీటి వనరుల్లో ఫిష్ సీడ్ ను సరఫరా చేయాలని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

వచ్చే పంట సీజన్ కు 7.5 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని అధికారులు తెలిపారు. నాఫెడ్ నుంచి మినుములు ఇతర వాణిజ్య పంటల్ని కొనుగోలు చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు ముఖ్యమంత్రికి వివరించారు. పీఎండీఎస్ పథకం ద్వారా తక్కువ యూరియా వినియోగానికి ఇచ్చే ప్రోత్సాహకం పై కేంద్రంతో మాట్లాడాలని వారికి సూచించారు. మదనపల్లె లో ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ ఏర్పాటు కానుందని ముఖ్యమంత్రి అన్నారు.

# ధాన్యం కొనుగోళ్లపై ప్రతిపక్షాల దుష్ప్రచారం

**మొదటిపేజీ తరువాయి**

ఈ రబీ సీజన్ లో 67 లక్షల ఎకరాలలో వరి సాగులో, 141 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి రానుందని, 90 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు ప్రభుత్వం సన్నద్ధమయ్యిందని, ఇప్పటి వరకు ప్రభుత్వం 17.28 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, రూ. 2,310 కోట్లు చెల్లించినట్లు వివరించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాల అంశలో బిఆర్ఎస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని, ధాన్యం కొనుగోలు కేంద్రాలలో గతంలో లే ని విధంగా వసతులు కల్పించామని, అకాల వర్షాలు సంభవిస్తే ధాన్యం తడిసి పోకుండా ఉండేందుకు 2.63 లక్షల టార్పాలిన్స్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

రాష్ట్ర వ్యాప్తంగా 8,575 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని, 18.75 కోట్ల గన్ని బ్యాగులు అందుబాటులో ఉం చామని, 64.83 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసే సామర్థ్యం ఉందన్నారు. అదనంగా 11.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ చేసేందుకు గోదాముల గుర్తించినట్లు మంత్రి తెలియజేశారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లులకు తరలించేందుకు గా ను 6,200 వాహనాల ఏర్పాటు చేశామని, కొనుగోలు కేంద్రాలలో రైతులకు దాహార్తి తీర్చేందుకు వీలుగా మం చినీటి సరఫరా, ఓఆర్ఎస్ సరఫరా ఏర్పాట్లు చేశామని మంత్రి చెప్పుకొచ్చారు. కొనుగోలు కేంద్రాలలో ఉద యం, సాయంత్రం కొనుగోలుకు ఆదేశాలు జారీ చేశామని, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎప్పటికప్పుడు రాష్ట్ర స్థాయి నోడల్ అధికారి పర్యవేక్షణ ఉంటుందని, అన్నింటికీ మించి ధాన్యం కొనుగోలు అంశంపై ప్రత్యేకించి పౌ ర సరఫరాల శాఖా కేంద్ర కార్యాలయంలో కంట్రోల్ రూ మ్ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. తాలు పేరుతో కోత విధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, తూకం అంటూ తగ్గిస్తే సహించేది లేదని మంత్రి హెచ్చరించారు.


రైతులకు నష్టం కలిగించే ఏ చర్యను ప్రభుత్వం సమర్థించదని మంత్రి పేర్కొన్నారు. అకాల వర్షాలు సంభవిస్తే రైతులు, సిబ్బంది చెట్లు కింద, కరెంట్ స్తంభాల దగ్గర ఉంటే పిడుగుపాటుకు గురి కాకుండా సూచనలు చేస్తున్నామని, వాతావరణంలో సంభవిస్తున్న మార్పులను ఎ ప్పటికప్పుడు కొనుగోలు కేంద్రాలకు సమాచారం అం దించేందుకు ప్రత్యేక మెకానిజం ఏర్పాటు చేసినట్లు వివరించారు. కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు నిరీక్షించకుండా ప్రత్యేక టోకెన్లు ఏర్పాటు చేసినట్లు మంత్రి పేర్కొన్నారు. క్షేత్ర స్థాయిలో బిఆర్ఎస్ నేతల తప్పుడు ప్రచారాన్ని రైతులు నమ్మడం లేదని, వరుసగా నాలుగు ఎన్నికల్లో ప్రజలు తిరస్కరించినా గుణపాఠం నేర్చుకోలేదని ధ్వజమెత్తారు.

# హైదరాబాద్ మెట్రో ఫేజ్-2కు ఆమోదం

### కేంద్ర ప్రభుత్వం భాగస్వామ్యంతో ప్రాజెక్ట్ -ఫేజ్-3కింద ఎయిర్‌పోర్ట్-ఫ్యూచర్ సిటీ కారిడార్

### కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం రేవంత్ రెడ్డి వినతి

**న్యూఢిల్లీమే 6(ప్రజావినికిడి):**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటనలో భాగంగా కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌తో సమావేశమయ్యారు. దాదాపు అరగంట పాటు భేటీ అయిన ఇరువురు నేతలు రాష్ట్రానికి సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. మెట్రో రెండో దశకు అవసరమైన అనుమతులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా సీఎం విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం ఆధీనంలోకి తీసుకున్నట్టు కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. మెట్రో రెండో దశ డీపీఆర్‌ను వెంటనే ఆమోదించాలని, శంషాబాద్ ఎయిర్‌పోర్టు-ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను ఫేజ్-3 కింద చేపట్టాలని కోరారు. ఏడు కారిడార్లతో కూడిన మెట్రో ఫేజ్-2సమగ్ర ప్రణాళికను రూపొందించి డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి హైదరాబాద్ మెట్రో ఫేజ్-2, మెట్రో ఫేజ్-3పై కేంద్ర మంత్రితో చర్చించారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న హైదరాబాద్ నగరంలో ప్రయాణికుల సౌకర్యార్థం మెట్రోను మరింతగా విస్తరించాల్సిన



అవసరం ఉందని కేంద్ర మంత్రికి సీఎం తెలియజేశారు. హైదరాబాద్ మెట్రో రైలు విస్తరణ సజావుగా సాగాలనే ఉద్దేశ్యంతోనే మెట్రోను రాష్ట్ర ప్రభుత్వం స్వాధీనం చేసుకుందని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు సీఎం వివరించారు. ప్రస్తుతం ఫేజ్-1 ప్రభుత్వం పరిధిలో ఉండడంతో విస్తరణ సులువవుతుందన్నారు. హైదరాబాద్‌లో మెట్రో రైలు నెట్‌వర్క్‌ను విస్తరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఫేజ్-2లో ఏడు కారిడార్లతో మొత్తం 122.9 కి.మీ మేర విస్తరణకు, రూ. 38,595 కోట్ల అంచనా వ్యయంతో రూపొందించిన సమగ్ర డీపీఆర్‌ను ఇప్పటికే సమర్పించామని సీఎం తెలిపారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్-2 ప్రాజెక్ట్ ను భారత ప్రభుత్వం ? తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాల జాయింట్ వెంచర్ గా చేపట్టేందుకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. హైదరాబాద్ నగర భవిష్యత్ అవసరాల దృష్ట్యా ఆర్జీఐ ఎయిర్‌పోర్ట్ ,భారత్ ఫ్యూచర్ సిటీ కారిడార్‌ను మెట్రో ఫేజ్-3గా చేపట్టాలని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. మెట్రో ఫేజ్-ఎఎ కిసంబంధించిన డీపీఆర్ ను ఇప్పటికే సమర్పించామని కేంద్ర మంత్రికి సీఎం తెలిపారు. సమావేశంలో కేంద్ర గృహనిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖ కార్యదర్శి కె.శ్రీనివాస్, ముఖ్యమంత్రి ప్రత్యేక కార్యదర్శి బి.అజిత్ రెడ్డి, హెచ్ఎంఆర్ఎల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (పట్టణ రవాణా) ఎన్.వి.ఎస్.రెడ్డి, ఢిల్లీ తెలంగాణ భవన్ ప్రత్యేకాధికారి సంజయ్ కుమార్, కేంద్ర ప్రభుత్వ పథకాల సమన్వయ కార్యదర్శి అద్వైత్ కుమార్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ వైద్యుల నిర్లక్ష్యం

**మొదటిపేజీ తరువాయి**

తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బాధ్యతారాహిత్యాన్ని ఎంతమాత్రం సహించబోమని స్పష్టం చేస్తూ.. డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని 51 మంది వైద్యులను విధుల నుంచి శాశ్వతంగా తొలగిస్తున్నట్లు ప్రకటించారు. శాశ్వత ఉద్వాసనకు గురైన 51 మందిలో బోధనాసుపత్రులకు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్లు 8 మంది, అసిస్టెంట్ ప్రొఫెసర్లు 41 మంది, ఇద్దరు ట్యూటర్లు ఉన్నారు. వీరితో పాటు మరో ముగ్గురు ప్రొఫెసర్లపై త్వరలోనే కఠిన చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. తొలగించిన వారిలో కొందరు ఏడేళ్ల నుంచి, మరికొందరు ఆరేళ్ల నుంచి విధులకు దూరంగా ఉంటూ సొంత వ్యాపకాలు సాగిస్తున్నారు. ఏపీ సివిల్ సర్వీసెస్ (కాండక్ట్) రూల్స్-1964 ప్రకారం ఏడాదికి మించి విధులకు గైర్హాజరైతే రాజీనామా చేసినట్లుగానే పరిగణించే అధికారం ప్రభుత్వానికి ఉంది. నిబంధనల మేరకు వీరికి ముందస్తుగా షోకాజ్ నోటీసులు జారీ చేసి, వివరణ ఇవ్వడానికి తగిన సమయం ఇచ్చినప్పటికీ ఎటువంటి స్పందన లేకపోవడంతో ఈ కఠిన నిర్ణయం తీసుకున్నారు. ఏడాదిలోపు గైర్హాజరీలో ఉన్న మరో 33 మంది వైద్యులు ఇందులో ఇద్దరు అసోసియేట్ ప్రొఫెసర్లు, 31 అసిస్టెంట్ ప్రొఫెసర్లకు ఛార్జిమెమోలు జారీ చేశారు. నిర్ణీత గడువులోగా విధుల్లో చేరని పక్షంలో వీరిని కూడా విధుల నుంచి తొలగించనున్నట్లు హెచ్చరించారు. ప్రభుత్వ హెచ్చరికలతో ఇప్పటికే 11 మంది వైద్యులు తిరిగి విధుల్లో చేరారు. వైద్యుల బాధ్యతారాహిత్యాన్ని ఏమాత్రం ఉపేక్షించే ప్రసక్తే లేదని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేశారు. . త్వరలోనే మరో ముగ్గురు ప్రొఫెసర్లపై కూడా ఇటువంటి చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సిద్ధమవుతోంది. విధులకు గైర్హాజరైన వారిలో కాకుండా, మరో 33 మంది వైద్యులకు ప్రభుత్వం ఛార్జిమెమోలు జారీ చేసింది. వైద్య సేవలకు ఎటువంటి ఆటంకం కలగకూడదనే ఉద్దేశంతోనే ఈ కఠిన నిర్ణయాలు తీసుకున్నట్లు అధికారులు తెలిపారు.

# ‘ప్రాజెక్ట్ ఫ్రీడమ్‘ను నిలిపివేసిన ట్రంప్

**మే 6(ప్రజావినికిడి):**

ఇరాన్‌తో చర్చల్లో పురోగతి సాధించామని, పాకిస్థాన్ వంటి దేశాల అభ్యర్థన మేరకు కీలక నిర్ణయం తీసుకున్నామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తెలిపారు. హర్మూజ్ జలసంధిలో అమెరికా నేతృత్వంలో చేపట్టిన ‘ప్రాజెక్ట్ ఫ్రీడమ్‘ను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు ఆయన బుధవారం ప్రకటించారు. అయితే, ఇరాన్‌పై విధించిన దిగ్బంధనం మాత్రం పూర్తిస్థాయిలో కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ మేరకు ట్రంప్ సోషల్ మీడియాలో ఒక ప్రకటన విడుదల చేశారు. “ఇరాన్‌తో తుది ఒప్పందం దిశగా గణనీయమైన పురోగతి సాధించాం. పాకిస్థాన్, ఇతర దేశాల అభ్యర్థన మేరకు ‘ప్రాజెక్ట్ ఫ్రీడమ్‘ కింద నౌకల కదలికలను కొంతకాలం నిలిపివేయాలని నిర్ణయించాం. ఒప్పందం ఖరారవుతుందో లేదో చూసేందుకే ఈ విరామం“ అని ఆయన పేర్కొన్నారు. అంతకుముందు వైట్‌హౌస్‌లో జరిగిన ఒక కార్యక్రమంలో మాట్లాడిన ట్రంప్, ఇటీవలి సైనిక చర్యల్లో ఇరాన్ నావికా, వైమానిక దళాలు పూర్తిగా దెబ్బతిన్నాయని వ్యాఖ్యానించారు. వారి సైనిక శక్తిని సర్వనాశనం చేశామని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతోందని, అందుకే ఇరాన్ ఒప్పందం కోసం ముందుకు వస్తోందని ఆయన అన్నారు. ప్రపంచ వాణిజ్యానికి కీలకమైన హర్మూజ్ జలసంధి తమ నియంత్రణలోనే ఉందని అమెరికా రక్షణ మంత్రి పీట్ హెగ్సెత్ కూడా స్పష్టం చేశారు. ఇరాన్‌తో చర్చల ఫలితం వెలువడేంత వరకు ఈ తాత్కాలిక విరామం కొనసాగనుంది.

# 9న బెంగాల్ కేబినేట్ ప్రమాణం

**మొదటిపేజీ తరువాయి**

కార్యక్రమం జరుగుతుందని ఆ రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య బుధవారం కోల్‌కతాలో ప్రకటించారు. ఉదయం10 గంటలకు మహానగరంలోని ప్రతిష్టాత్మక బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమం జరుగుతుందని వివరించారు.గురువారం సాయంత్రం కోల్‌కతాలో శాసనసభా పక్ష సమావేశం జరుగుతుందని సమిక్ భట్టాచార్య తెలిపారు. ఈ సమావేశంలో శాసనసభా పక్ష నేతను పార్టీ ఎమ్మెల్యేలు అంతా కలిసి ఎన్నుకుంటారని చెప్పారు. ముఖ్యమంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, పలువురు కేంద్రం మంత్రులు, బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులు, ఎన్డీయే నాయకులు హాజరవుతారని అంచనా వేస్తున్నారు. కార్యక్రమానికి పార్టీ సీనియర్ నేతలతోపాటు కార్యకర్తలు పెద్ద ఎత్తున హాజరవుతారని పార్టీ నేతలు చెబుతున్నారు. పశ్చిమ బెంగాల్‌లో కొత్తగా కొలువుదీరనున్న మంత్రి వర్గంలో దాదాపు 24 మంది మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసే అవకాశాలు ఉన్నాయని రాష్ట్ర నాయకత్వం చెబుతుంది. మరోవైపు ఈ ప్రమాణ స్వీకార కార్యక్రమం ఏర్పాట్లపై ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇప్పటికే దృష్టి కేంద్రీకరించారు.

# కాంగ్రెస్‌కు పిండం పెడితేనే..రైతులకు న్యాయం

**మొదటిపేజీ తరువాయి**

రేవంత్ రెడ్డి ఎక్కడికి పోయారని ప్రశ్నించారు. హనుమకొండలో నిర్వహించిన రైతు సంగ్రామ సదస్సులో కేటీఆర్ మాట్లాడుతూ.. డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని సూచించారు. రైతు డిక్లరేషన్ పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని కేటీఆర్ అన్నారు. రైతు భరోసా కింద ఎకరానికి రూ.15 వేలు ఎందుకు ఇవ్వడం లేదని సీఎం రేవంత్ రెడ్డిని కేటీఆర్ ప్రశ్నించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ జరిగిందా అని అడిగారు. రైతుకూలీలకు రూ.12వేలు ఇస్తామన్న హామీ ఏమైందని నిలదీశారు. అన్ని పంటలు బోనస్ ఇచ్చి కొంటామన్నారని గుర్తుచేశారు. కౌలు రైతులకు ఎకరానికి రూ.14వేలు వస్తుందా అని ప్రశ్నించారు. పంటబీమా పథకం ఎక్కడకు పోయిందని అడిగారు. అసైన్డ్ భూములకు పట్టాలు ఎప్పుడిస్తారన్నారు. దుక్కిదున్నే రైతులను దారుణంగా వంచించారని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్‌ది మెగా రైతు మేళా కాదు.. దగా రైతు మేళా అని విమర్శించారు. కాంగ్రెస్ పార్టీ కరోనా కంటే డేంజర్ అని సెటైర్ వేశారు. చెడ్డీ గ్యాంగ్ కంటే డేంజర్ కాంగ్రెస్ నాయకులు అని విమర్శించారు. డిక్లరేషన్లు, ఆరు గ్యారంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో క్రమం తప్పకుండా రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ హయాంలో నాట్లు వేసే సమయంలో రైతుబంధు పడేదని గుర్తుచేశారు. కేసీఆర్ తీసుకొచ్చిన రైతుబంధు పథకాన్ని 12 రాష్ట్రాలు కాపీ కొట్టాయని తెలిపారు. గతంలో రైతులు పెట్టుబడి కోసం అప్పుల పాలయ్యే వారని గుర్తుచేశారు. రైతులకు 11 విడతలుగా రూ.73 వేల కోట్లు ఇచ్చారని తెలిపారు. కానీ కాంగ్రెస్ వచ్చాక రైతుబంధు సమయానికి ఇవ్వడం లేదని తెలిపారు. సర్పంచ్ ఎన్నికల ముందు ఓట్ల కోసం ఒక్కసారే రైతు భరోసా ఇచ్చారని అన్నారు.డిక్లరేషన్ అమలుకు రైతులు కాంగ్రెస్ పార్టీ నాయకులను గల్లాపట్టి నిలదీయాలని కేటీఆర్ అన్నారు. రైతన్నలు కాళ్లు పట్టుడు బంద్ చేసి.. కాంగ్రెస్ వాళ్ల కాలర్ పట్టాలని సూచించారు. దండం పెట్టడం కాదు.. కాంగ్రెస్ పార్టీకి పిండం పెట్టండి.. అట్లయితేనే రైతులకు మంచి రోజులు వస్తాయని అన్నారు. తాలు తీస్తే రైతులు నీ తోలు తీస్తారని సీఎం రేవంత్ రెడ్డిని హెచ్చరించారు. మక్కలు కొనకపోతే నీ ప్రభుత్వం వెయ్యి ముక్కలవుతుందని వార్నింగ్ ఇచ్చారు.సీఎం రేవంత్‌రెడ్డి రైతుబంధు బంద్ పెట్టి.. రాహుల్‌గాంధీకి కప్పం కడుతున్నారని కెటిఆర్ విమర్శించారు. కాంగ్రెస్ నేతలు కనపడితే రైతుబంధు ఇంకా ఎప్పుడు ఇస్తారని కాలర్ పట్టుకుని నిలదీయాలని హెచ్చరించారు. రూ. 50వేల కోట్ల రుణమాఫీ చేస్తానని సీఎం చెప్పారని.. కానీ రూ. 12వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారని ధ్వజమెత్తారు.

ఆయన ఎనుముల రేవంత్‌రెడ్డి కాదు... ఎగవేతల రేవంత్ రెడ్డి అని కేటీఆర్ సెటైర్లు గుప్పించారు. కాంగ్రెస్ నేతలకు రైతన్నల ప్రతాపం చూపించే రోజు దగ్గరలోనే ఉందని హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యూవల్ సీఎం అని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీని ఒక్క ఊరిలోనైనా సంపూర్ణంగా చేసిందని నిరూపిస్తే తాను ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని సవాల్ చేశారు. ఈ సవాల్‌ను రేవంత్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు స్వీకరిస్తారో చెప్పాలని అన్నారు. సమ్మక్క - సారలమ్మ జాతరలో రూ.70 కోట్ల విషయంలో మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క కొట్టుకున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణను దండుపాళ్యం బ్యాచ్‌లా రేవంత్‌రెడ్డి అండ్ కో దోచుకుంటున్నారని ఆరోపించారు. కాళేశ్వరంపై ఇన్నాళ్లూ చేసినవి తప్పుడు ఆరోపణలని తేలిపోయిందని.. ఇకపై ఆరోపణలు చేస్తే తగిన సమాధానం చెబుతామని హెచ్చరించారు. మేడిగడ్డను కాంగ్రెస్ నేతలు బాంబులు పెట్టి పేల్చేశారని విమర్శించారు. రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యేల కొనుగోలు తెలుసు... ధాన్యం కొనుగోలు తెలియదని ఎద్దేవా చేశారు. బస్తాల్లో డబ్బులు మోసేది తెలుసు.. యూరియా బస్తాలు ఇచ్చేది తెలియదని కేటీఆర్ విమర్శించారు. కేంద్రంలో బడేభాయ్ చెప్పినట్లుగా.. రాష్ట్రంలో చోటేభాయ్ ఆడుతున్నారని సెటైర్లు గుప్పించారు. రాహుల్‌గాంధీ గతంలో వరంగల్ వచ్చి రైతు డిక్లరేషన్ పేరుతో సభ పెట్టారని ప్రస్తావించారు. రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి నాడు మాట్లాడిన స్పీచ్ సభలో ప్రదర్శించామని.. వరంగల్ రైతు డిక్లరేషన్ పేరుతో 34హామీలు ఇచ్చారని గుర్తుచేశారు.

ప్రజా వినికిడి
మా అక్షరం-మీ ఆయుధం
తెలుగు దినపత్రిక



# రెడీ టూ సర్వ్ వృద్ధాశ్రమానికి అండగా అర్గానో సాఫ్ట్‌వేర్ సంస్థ




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి)**
సమాజంలో ఆదరణ కరువైన వృద్ధులకు అండగా నిలుస్తోంది ప్రముఖ సంస్థ 'అర్గానో సాఫ్ట్‌వేర్' సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత సీఎస్ ఆర్ లో భాగంగా కేవలం వ్యాపారానికే పరిమితం కాకుండా,తమ సేవాగుణాన్ని చాటుకుంటూ పలువురికి ఆదర్శంగా నిలుస్తోంది. వనస్థలిపురంలోని 'రెడీ టూ సర్వ్' వృద్ధాశ్రమానికి విశేష దాతృత్వాన్ని పంచుతూ, పండుటాకుల పట్ల తమకున్న సామాజిక బాధ్యతను ఘనంగా చాటుకుంటోంది.

ఆరు నెలలుగా క్రమం తప్పని సాయం
గత ఆరు నెలలుగా 'రెడీ టూ సర్వ్' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న వృద్ధాశ్రమానికి అర్గానో సాఫ్ట్‌వేర్ సంస్థ పెద్ద దిక్కుగా మారింది. ఆశ్రమవాసుల అవసరాలను సూక్ష్మంగా గమనించి,వారికి అత్యంత అవసరమైన నిత్యావసర వస్తువులను, ప్రాణాలను నిలిపే అత్యవసర మందులను ప్రతి నెలా క్రమం తప్పకుండా అందజేస్తోంది. వారి కనీస అవసరాలను తీరుస్తూ పెద్దలకు కొండంత భరోసా కల్పిస్తోంది.

లక్షల నిధులతో వసతుల కల్పన
కేవలం నెలవారీ సరుకులతోనే తమ బాధ్యత తీరిపోయిందని అనుకోకుండా, ఆశ్రమ వాసుల సౌకర్యార్థం అర్గానో సంస్థ భారీగా నిధులు వెచ్చించింది.'రెడీ టూ సర్వ్' నిర్వాహకుల అభ్యర్థన మేరకు వెంటనే స్పందించిన యాజమాన్యం.. లక్షలాది రూపాయలు ఖర్చు చేసి ఆశ్రమంలో మౌలిక వసతులు కల్పించింది. ఎండాకాలంలో వృద్ధులు ఉక్కపోతతో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఎయిర్ కూలర్లు, అలాగే స్వచ్ఛమైన తాగునీటి కోసం అధునాతన వాటర్ డిస్పెన్సర్లను కూడా సమకూర్చింది. సేవయే పరమావధిగా "వృద్ధుల సౌకర్యం, ఆరోగ్యం, ఆనందం..ఇవే మా సంస్థ సేవ కార్యక్రమాల ప్రథమ లక్ష్యం" అంటూ అర్గానో సాఫ్ట్‌వేర్ ఇండియా ఎం.డి మధుసూదన్ సెరి పేర్కొన్నారు.

కృతజ్ఞతలు తెలిపిన నిర్వాహకులు
తమ ఆశ్రమానికి అడిగిన వెంటనే మౌలిక వసతులు కల్పించడమే కాకుండా, ప్రతినెలా క్రమం తప్పకుండా ఆదుకుంటున్న అర్గానో సాఫ్ట్‌వేర్ సంస్థ యాజమాన్యానికి 'రెడీ టూ సర్వ్' సంస్థ నిర్వాహకులు పెద్ది శంకర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. కార్పొరేట్ సంస్థలు ఇలా సామాజిక స్పృహతో ముందుకు వస్తే, సమాజంలో నిస్సహాయ స్థితిలో ఉన్న ఎంతో మంది అభాగ్యులకు మరింత మెరుగైన సేవలు అందించగలమని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. అర్గానో సంస్థ చూపుతున్న ఈ చొరవ సమాజంలోని ఇతర కార్పొరేట్ సంస్థలకు సైతం స్ఫూర్తిదాయకం, మార్గదర్శకత్వం.

# మంత్రి కొండా సురేఖ రాజీనామా చేయాలి..

## హిందువులను అవమానించడమే సెక్యులరిజమా.? -బిజెపి నాయకురాలు రాజేశ్వరి..



**మెట్టుగూడ,(ప్రజావినికిడి):**
దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి అయి ఉండి హిందువుల ఆరాధ్య దైవం అయిన శ్రీ రాముడు మీద అనుచిత వ్యాఖ్యలు చేసి కోట్లాది హిందువుల మనోభావాలను దెబ్బతీసిన దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ వెంటనే రాజీనామా చేయాలని లేదా ముఖ్యమంత్రి మంత్రివర్గం నుండి భర్తరఫ్ చేయాలని బిజెపి ఓబీసీ మోర్చా రజక సెల్ రాష్ట్ర కన్వీనర్ మల్లేశ్వరపు రాజేశ్వరి డిమాండ్ చేశారు.మెట్టుగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిగా ఉన్న కొండ సురేఖ హిందూ దేవుళ్లను విమర్శించడం సిగ్గుచేటని భేషరతుగా హిందువులకు క్షమాపణ చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఓ ఎమ్మెల్యే వచ్చే జన్మంటూ ఉంటే ముస్లిం అయి పుట్టాలని కోరుకుంటున్న అంటూ హిందువులను హేళన ఈయన చేసి మాట్లాడితే హిందువులు తగిన బుద్ధి చెప్పిన విషయం కొండా సురేఖ గుర్తుంచుకోవాలని అన్నారు. తెలంగాణ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులున్న నిధులు తేవడం చేతకావడం లేదన్న కొండ సురేఖ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మామునూర్ వద్ద ఎయిర్ పోర్ట్,స్మార్ట్ సిటీ కింద కేంద్ర నిధులు,గిరిజన విశ్వవిద్యాలయం, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ ఎవరు ఇచ్చారో తెలుసుకొని మాట్లాడాలని కేవలం మంత్రి సురేఖ తన పదవిని కాపాడుకోవడానికి మాత్రమే ఇలాంటి దిగజారుడు వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. బిజెపి వాళ్లకు ఎక్కడ పని లేదని దేవుని పేరు మీద ఓట్లు అడుగుతారని మోడీతో మీటింగ్ పెట్టి నాలుగు ముక్కలు హిందీలో మాట్లాడించి పంపిస్తారని విమర్శించడం కాంగ్రెస్ పాలకులకు పాలించడం చేతకాకనేనని మరి రాహుల్ గాంధీ వరంగల్ వచ్చినప్పుడు ఏ భాష మాట్లాడారో మంత్రి సురేఖ గుర్తెరగాలని అన్నారు.మంత్రి సురేఖ భేషరతుగా క్షమాపణ చెప్పకుంటే హిందూ సంఘాల ఆధ్వర్యంలో ఎక్కడికక్కడ అడ్డుకుంటామని హెచ్చరించారు.కాంగ్రెస్ అంటేనే ముస్లింల పార్టీకి బహిరంగంగా చెప్పుకునే కాంగ్రెస్ నాయకులకు హిందుత్వాన్ని విమర్శించడం ఫ్యాషన్ అయిందన్నారు. గతంలో కూడా పార్లమెంటు సాక్షిగా ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ హిందూ దేవి దేవతలు హింసావాదులని అందుకే వారి చేతుల్లో ఆయుధాలు ఉంటారని హిందూ దేవుళ్లను హేళన చేసి మాట్లాడరని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హిందూమతంలో పెళ్లి కానోళ్లకు ఒక దేవుడు పెళ్లి అయిన వారికి ఒక దేవుడు ఇద్దరు పెళ్ళాలు ఉన్న వాళ్లకు ఒక దేవుడు తినే వారికి ఒక దేవుడు తాగేవారికి ఒకదేవుడు అంటూ విమర్శించారని అన్నారు.ఇలాంటి వ్యాఖ్యలు తెలంగాణ ప్రజలు మర్చిపోకముందే మందుల సామేలు అనే ఎమ్మెల్యే సంస్కృతంలోని మంత్రాలను బూతు పదాలతో పోల్చడం తెలంగాణ ప్రజలు మర్చిపోకముందే దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రిని అన్న విషయం మరిచిపోయి కోట్లాది హిందువుల హృదయాలను మంత్రి కొండా సురేఖ గాయపరిరిచిందన్నారు. అలాంటప్పుడు దేవాదాయ ధర్మాదాయ శాఖను రద్దుచేసి హిందూ దేవాలయాలపై విత్తనాన్ని ప్రభుత్వం విరమించుకొని హిందూ మఠాధిపతులకి అప్పగించాలని డిమాండ్ చేశారు.లేదంటే మసీదులను చర్చిలను దేవాదాయ ధర్మాదాయ పరిధిలోకి తీసుకువచ్చి నప్పుడే అసలైన సెక్యులరిజం అన్నారు.సెక్యులరిజం ముసుగులో హిందువులనుద్దేశించి ఏది మాట్లాడినా చెల్లుతుందని అనుకుంటే నాలుక చీరేస్తామని హెచ్చరించారు.

# తెలంగాణలో రానున్నది బిజెపి సర్కార్..

- కాంగ్రెస్ అవినీతికి ఇక స్వస్తి పలుకుదాం..
- బీఆర్ఎస్ ను చూశారు.. కాంగ్రెస్ ని చూశారు..
- బిజెపికి ఒక అవకాశం ఇవ్వండి..
- తెలంగాణ వికాసమే బిజెపి లక్ష్యం..
- బీఆర్ఎస్ కాంగ్రెస్ లది అవినీతి రాజ్యం..
- బిజెపి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్ రెడ్డి
- ప్రధాని మోడీకి పర్యటన విజయవంతం చేయండి..మోడీ పర్యటన పోస్టర్ విడుదల..



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
ప్రధాని మోడీకి పర్యటన ఆరంభం మాత్రమే.. ఇలాంటివి ముమ్ముందు ఎన్నో ఉంటాయి.. తెలంగాణలో బిజెపికి అధికారమే లక్ష్యంగా ముందడుగు వేస్తాం.. అనుకున్నది సాధిస్తాం.. తెలంగాణ వికాసమే లక్ష్యంగా పనిచేస్తా.. అని బిజెపి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి గుజ్జల ప్రేమేందర్ రెడ్డి అన్నారు. షాద్ నగర్ పట్టణంలో పార్టీ ఇన్చార్జి అందె బాబయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రంగారెడ్డి జిల్లా పార్టీ అధ్యక్షుడు పతంగి రాజా భూపాల్ గౌడ్ హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,
తెలంగాణకు వస్తున్న మోడీ సభను విజయవంతం చేయడంలో భాగంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మీడియా ద్వారా, సామాజిక మాధ్యమాల ద్వారా ప్రసారం చేసి మోడీ సభకు అన్ని నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున జనం హాజరయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సాయంత్రం మాట్లాడుతూ, ప్రజలు పదేళ్ల బిఆర్ఎస్ ను చూశారు.ఆ పార్టీ ఎంత అవినీతికి పాల్పడిందో కెసిఆర్ కూతురే చెబుతుంది.ఇక కాంగ్రెస్ పాలనలో రాష్ట్రం అవినీతిమయంగా మారిపోయింది. అందుకే ఒక్కసారి బిజెపి కి అవకాశం ఇవ్వాలని కోరుతున్నామని వెల్లడించారు. కాంగ్రెస్ ఎన్నికలకు ముందు అబద్ధాలు చెప్పి అధికారంలోకి వచ్చిందని, ఇప్పుడు హామీలు తీర్చకుండా కాలక్షేపం చేస్తుందని విమర్శించారు. రైతులకు బోనస్, కౌలు రైతులకు రుణమాఫీ, రైతుబంధు,రైతు భరోసా, యువతకు ఉద్యోగాలు, మహిళల ఖాతాల్లో డబ్బులు వేస్తామన్నారు. ఎక్కడో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. అదేవిధంగా తాము అధికారంలోకి రాగానే అవినీతికి పాల్పడిన బీఆర్ఎస్ నాయకులను జైల్లో పెడతామన్న హామీ ఏమైందని ధ్వజమెత్తారు. విద్యుత్ కోతలు, కాలేశ్వరం,ఈ రేసుల విషయంలో హడావిడి చేసి ఎందుకు మౌనంగా ఉన్నారని ప్రశ్నించారు. లోలోపల కాంగ్రెస్ -బిఆర్ఎస్ లు కుమ్మక్కయ్యాయని దానిని కప్పి పుచ్చుకునేందుకే బిజెపి విమర్శిస్తున్నాయని ఆరోపించారు.



**మోదీ వెంట అభివృద్ధి..**
ప్రధాని మోదీ తెలంగాణకు అభివృద్ధిని వెంట తీసుకొస్తున్నారని గుజ్జల ప్రేమేందర్ రెడ్డి వెల్లడించారు. వికసిత తెలంగాణ లక్ష్యంగా ఆయన ఇక్కడికి వస్తున్నారన్నారు. ఇప్పటికి 15 లక్షల కోట్ల రూపాయలను అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చిందని స్పష్టం చేశారు. దేశమంతటా బిజెపి విజయంతో దూసుకుపోతుందని,తెలంగాణలో కూడా బిజెపి ప్రభుత్వం రావాల్సిన అవసరం ఉందని ఆయన అభిప్రాయపడ్డారు. కేంద్ర ప్రభుత్వ నిధులతోనే తెలంగాణలో జాతీయ రహదారులు, రైల్వే స్టేషన్ లో పునరుద్ధరణ, రైతులకు నిధులు, మెడికల్ కళాశాల అభివృద్ధి వంటివి జరిగాయని వెల్లడించారు. మహిళా రిజర్వేషన్లను వ్యతిరేకించి, పునర్విభజనను అడ్డుకున్న కాంగ్రెస్ కు బుద్ధి చెప్పి బిజెపి ప్రభుత్వానికి ప్రజలు మద్దతుగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లా అధ్యక్షుడు పతంగి రాజభూపాల్ గౌడ్, నేతలు అందె బాబయ్య,శ్రీ వర్ధన్ రెడ్డి,కక్కునూరు వెంకటేష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతన్నలకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

## : మేడ్చల్ నియోజకవర్గం బిజెపి ఇన్‌ఛార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి..



**ఘట్ కేసర్,(ప్రజావినికిడి):**
ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులకు మౌలిక సదుపాయాలు కల్పించాలని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు,మేడ్చల్ నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి ఏనుగు సుదర్శన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మేడ్చల్ జిల్లా ఘట్ కేసర్ మండలం ఎదులాబాద్, మాదారం గ్రామాలలో నిన్న రాత్రి కురిసిన వర్షాలకు వడ్ల కొనుగోలు కేంద్రాల్లో తడిసిపోయిన ధాన్యాన్ని సుదర్శన్ రెడ్డి పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,
రైతులు తమ ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చి పదిహేను రోజులు గడుస్తున్నా అధికార యంత్రాంగం వివిధ కారణాలు చెప్పి ధాన్యం కొనుగోళ్లలో అలసత్వం చూపిస్తోందని అన్నారు.కేంద్ర ప్రభుత్వం రైతుల కోసం 2389 రూపాయల మద్దతు ధర,సంచులు సుత్తిలి,కూలీల వేతనాలు ఇలా అనేక సదుపాయాలు అమలు చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద విద్యుత్ లైట్లు, మంచినీరు, రవాణా సౌకర్యం ఏర్పాటు చేయాలనీ, అర్ధరాత్రి సమయంలో విషపూరిత కీటకాలు, పాములతో రైతన్నలకు ప్రమాదం పొంచి ఉందని అన్నారు. ఘట్ కేసర్ మండలంలో ఇప్పటి వరకూ ఒక్క రైతుకు కూడా రైతు రుణమాఫీ కాలేదనీ,రైతు భరోసా రాలేదని వెంటనే అధికారులు స్పందించి సమస్యలను పరిష్కరించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చెయ్యాలని సుదర్శన్ రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు బట్టే శంకర్,మాజీ ఉప సర్పంచ్ మాయ నరేష్,ఘట్కేసర్ మండల ప్రధాన కార్యదర్శి రాచకట్ల శ్రీశైలం,గట్టుపల్లి మల్లేష్ ముదిరాజ్, ఎర్రోళ్ల మురళి, పూస వెంకటేష్, తోటకూర శ్రీనివాస్ యాదవ్,మీగా హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మే 10న మోడీ పర్యటనను అడ్డుకోవాలి




**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి ):**సికింద్రాబాద్ లో మే 10న జరిగే బీజేపీ మహా సభకు రానున్న నరేంద్ర మోడీ పర్యటనను అడ్డుకోవాలని ఈటి నరసింహ పిలుపునిచ్చారు. పెంచిన గ్యాస్ సిలిండర్ ధరలను తగ్గించాలని డీజిల్,పెట్రోల్ కృత్రిమ కొరత సృష్టిస్తున్న కేంద్ర బిజెపి ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ భారత కమ్యూనిస్టు పార్టీ( సిపిఐ) రాష్ట్ర సమితి హైదరాబాద్ జిల్లా సిపిఐ కౌన్సిల్ ఆధ్వర్యంలో సత్యనారాయణ రెడ్డి భవన్ నుండి హిమాయత్ నగర్ వై జంక్షన్ వరకు నిరసన ప్రదర్శన చేపట్టారు.ఈ సందర్భంగా ఈటి నరసింహ మాట్లాడుతూ, ఎన్నికల సందర్భంగా అనేక తప్పుడు వాగ్దానాలు చేస్తూ గ్యాస్ సిలిండర్ పెట్రోల్ ధరలు పెంచబోమని ప్రజలను మభ్యపెట్టి ఎన్నికలు అయిపోయిన వెంటనే కమర్షియల్ సిలిండర్ ధరలను ఎన్నడు లేని విధంగా 993 రూపాయలు పెంచడమే కాకుండా గత ఆరు నెలల కాలంలో ఆరుసార్లు పెంచడం జరిగింది. ఉద్యోగాలు లేక చిన్నచిన్న టీ స్టాల్, టిఫిన్ సెంటర్,హోటల్ లు నడుపుకుంటున్న నిరుద్యోగ యువత పై సిలిండర్ల ధరల ప్రభావము తీవ్రంగా పడింది. అనేక టీ స్టాళ్ళు టిఫిన్ సెంటర్లు మూతపడ్డాయి. హోటల్స్ రెస్టారెంట్లలో సిలిండర్ ధర పెరగడం మూలంగా ఆహార పదార్థాల రేట్లను పెంచడం జరిగింది. కేంద్ర ప్రభుత్వ విధానాల మూలంగా పరోక్షంగా ప్రజలపై పన్ను వేయడమే కాకుండా దోచుకోవడమే అని అన్నారు.అలాగే పెట్రోల్ బంకులలో డీజిల్,పెట్రోల్ కోసం వాహనాలు పెద్ద ఎత్తున క్యూలో నిల్చున్నాయి ఎక్కడ చూసినా బంకులు నో స్టాక్ బోర్డు లు కనిపిస్తున్న కూడా అలాంటిది ఏమి లేదని కేంద్ర ప్రభుత్వం చెప్పటం ప్రజలను మోసం చేయడమే అని అన్నారు. భారతదేశ పాలకవర్గాలు మన దేశానికి జరుగుతున్న నష్టాన్ని ఇప్పటికైనా గుర్తించి అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు రద్దు చేసుకోవాలని అదేవిధంగా ఇరాన్ తో మంచి సంబంధాలు పెంపొందించుకొని ఆయిల్ సరఫరాకు ఏ రకమైన ఆటంకం లేకుండా చూసుకోవాల్సిన బాధ్యత మన విదేశాంగ విధానంపై ఉందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ మే 10న తెలంగాణకు వస్తున్న సందర్భంగా విభజన హామీలు, తెలంగాణకు రావలసిన నిధులు కేటాయించకపోవడం వంటి విషయాల పై ప్రజలు రోడ్లమీద కొచ్చి తమ నిరసన తెలియజేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్,సహాయ కార్యదర్శి కమతం యాదగిరి,జిల్లా కార్యవర్గ సభ్యులు బి.వెంకటేశం, నేర్లకంటి శ్రీకాంత్ కాంపల్లి శ్రీనివాస్,మహమ్మద్ సలీం,ఉమర్ ఖాన్,జిల్లా కౌన్సిల్ సభ్యులు సక్రి బాయి, బాలకృష్ణ,మహమూద్,బొడ్డుపల్లి కిషన్,చైతన్య, హైమద్,అనిల్ కుమార్,గౌస్ భగత్ సింగ్, షబ్బీర్,సుశాంత్, అరుణ్,లతీఫ్, మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

# అభయ ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి




**ఎల్బీనగర్,(ప్రజావినికిడి):**మాన్సురాబాద్ డివిజన్ పరిధిలోని ఆర్టీసీ సూపర్వైజర్ కాలనీలో శ్రీ అభయ ఆంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమం ఘనంగా నిర్వహించబడిందిఈ కార్యక్రమానికి ప్రముఖ అతిథిగా ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి హాజరై, స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,భక్తి భావంతో నిర్వహించే ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు సమాజంలో ఐక్యతను పెంపొందించడంలో ముఖ్య పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. దేవాలయ అభివృద్ధికి తాను ఎల్లప్పుడూ సహకరిస్తానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్ రెడ్డి,హయత్‌నగర్ డివిజన్ భారాస పార్టీ అధ్యక్షులు చెన్నగోని శ్రీధర్ గౌడ్,భాస్కర్ సాగర్ దేవాలయ కమిటీ సభ్యులు, కాలనీవాసులు భక్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యార్థులును అభినందించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్






**షాద్ నగర్,(ప్రజావినికిడి):** పట్టణంలోని పద్మావతి కాలనీ లో గల ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి ఫలితాల లో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులును అభినందించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్.రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ పట్టణం పద్మావతి కాలనీ లో జిల్లా పరిషత్ (కుంట బడి)ఉన్నత పాఠశాలలో ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాలలో ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్.భాగ్యమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమనికి మండల విద్యాదికారి మనోహర్, 25వార్డు స్థానిక కౌన్సిలర్ పెంటయ్య,6 వార్డు కౌన్సిలర్ రాజు నాయక్ లతో కలసి హాజరైన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,ఈ సందర్భంగా ఉత్తమ ఫలితలను సాధించిన విద్యార్థులును సన్మానించిన మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్,ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు తదితరలు పాల్గొన్నారు.

# తప్పుడు కేసులపై విచారణ జరపండి..

**ఈ నెల 15 లోగా నివేదిక ఇవ్వండి.. - నందిగామ పోలీసులపై వచ్చిన ఫిర్యాదుపై షాద్ నగర్ డీసీపీకి పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ నోటీసులు..**

**రంగాపూర్ గ్రామానికి చెందిన కొంగర మహేష్, యదమ్మ,శేఖర్, వెంకటేష్‌లు తమపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారంటూ పోలీసులపై ఫిర్యాదు..**

**సీఐ పి.ప్రసాద్, ఏఎస్ఐ కె. శ్రీనివాస్,ఎస్ఐ ఎం. గోపాలకృష్ణలు తమను వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్న బాధితులు**




**షాద్ నగర్, (ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా నందిగామ పోలీసులపై వచ్చిన తీవ్రమైన ఆరోపణల నేపథ్యంలో జిల్లా పోలీస్ కంప్లైంట్స్ అథారిటీ (హైదరాబాద్ రీజియన్) కీలక ఆదేశాలు జారీ చేసింది. బాధితులు సమర్పించిన ఆధారాలను పరిశీలించిన అథారిటీ చైర్మన్ కె. సుదర్శన్, సభ్యులు,ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపి ఈ నెల 15 (మే 15,2026) లోగా నివేదిక సమర్పించాలని షాద్ నగర్ జోన్ డీసీపీని ఆదేశించారు.

కేసు వివరాల్లోకి వెళితే...రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన కొంగర మహేష్, యదమ్మ,శేఖర్, వెంకటేష్‌లు తమపై పోలీసులు తప్పుడు కేసులు పెట్టి వేధిస్తున్నారంటూ మార్చి 23న పోలీస్ కంప్లైంట్స్ అథారిటీని ఆశ్రయించారు. నందిగామ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ పి.ప్రసాద్,ఏఎస్ఐ కె.శ్రీనివాస్,ఎస్ఐ ఎం.గోపాలకృష్ణలు తమను వేధిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.

బాధితులపై తప్పుడు ఎఫ్ఐఆర్ (క్రైమ్ నెం.112/2025) నమోదు చేయడం, ఫిర్యాదు తేదీలను తారుమారు చేయడం,ఫోర్జరీ సంతకాలతో ఛార్జ్ షీట్ దాఖలు చేయడమే గాకుండా బాధితుల నుండి ద్వారా లంచాలు వసూలు చేశారని ఆరోపించారు. రాజకీయ ఒత్తిళ్లతో నిందితులకు కొమ్ముకాస్తూ ఆధారాలు సమర్పించినా కేసు నమోదు చేయకుండా కంప్లైంట్ చేసిన తమపైనే తప్పుడు కేసులు పెడుతున్నారని బాధితులు వాపోయారు.ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన అథారిటీడక్రైమ్ నెం.112/2025 రిజిస్ట్రేషన్ ఛార్జ్ షీట్ సమర్పించిన పరిస్థితులుడబాధితులు గతంలో ఇచ్చిన ఫిర్యాదులపై తీసుకున్న చర్యలుడలంచం వసూలు,ఫోర్జరీ సంతకాలపై పోలీసుల పాత్ర వంటి అంశాలపై విచారణ జరిపి నిర్దేశించిన గడువులోగా వాస్తవాలతో కూడిన నివేదికను అందజేయాలని షాద్ నగర్ డీసీపీని అథారిటీ నోటీసులో స్పష్టం చేసింది.

సుప్రీంకోర్టు (2020) ఆదేశాల మేరకు తెలంగాణ ప్రభుత్వం న్యాయ శాఖ జీఓ నంబర్ 46 జారీ చేసింది.

పోలీసుల క్రిమినల్ మిస్ కండక్ట్ పై వచ్చే పిర్యాదులపై విచారణ జరిపేందుకు రిటైర్డ్ జడ్జి అధ్యక్షతన పోలీస్ కంప్లైంట్స్ అథారిటీస్ ఏర్పాటైన సంగతి తెలిసిందే..

# కేటీఆర్.. ఓ "డ్రగ్" డాన్..

**నాడు రైతులను ముంచి నేడు మొసలి కన్నీరా.. -ఉరివేస్తే ఉరే అన్న పార్టీ ఆ నేడు మాట్లాడేది..**

**బీఆర్ఎస్ హయాంలో ఎనిమిది వేల మంది రైతుల ఆత్మహత్యలు..**

**మరోసారి సీఎం రేవంత్ గురించి మాట్లాడితే ఖబడ్దార్.. - షాద్ నగర్ ఎమ్మెల్యే ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరిక..**

**సీఎల్పీ కార్యాలయంలో మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డితో కలిసి మీడియా సమావేశం..**




**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
వరి వేస్తే ఉరే అంటూ ఆనాడు రైతులను వంచించారు. వేలాది మంది రైతుల ఆత్మహత్యలకు కారణమయ్యారు.. ఈరోజు రైతుల కోసం 24 గంటలు శ్రమిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని తిడతారా..? కాంగ్రెస్ పని తీరుపైనే మాట్లాడతారా..? డ్రగ్ డాన్ కెటీఆర్.. ఖబర్దార్..అంటూ రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్, షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ హెచ్చరించారు. హైదరాబాద్ సీఎల్పీ కార్యాలయంలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటిఆర్ వ్యాఖ్యలను నిరసిస్తూ సీఎల్పీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మహబూబ్ నగర్ ఎమ్మెల్యే, విప్ శ్రీనివాస్ రెడ్డితో కలిసి ఆయన మాట్లాడుతూ,డ్రగ్ మాఫియాగా,వైన్స్ మాపియాగా, ఇసుక మాఫియాగా పేరు ఉన్న కేటీఆర్ కాంగ్రెస్ పార్టీ గురించి మాట్లాడడం హాస్యాస్పదమని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో అసలు రైతుల కోసం చేసింది ఏమీ లేదని స్పష్టం చేశారు.2017లో ఖమ్మం జిల్లాలో వ్యవసాయ మార్కెట్లో రైతులు మిర్చికి మద్దతు ధర కోసం ఆందోళన చేస్తే వారిని జైలు పాలు చేసిన చరిత్ర బీఆర్ఎస్ పార్టీదని అన్నారు. యాసంగిలో వరి మీద ఆధారపడే రైతులకు మద్దతుగా ఉండాల్సింది పోయి "వరి వేస్తే ఉరి" వేసుకున్నట్లే అంటూ భయపెట్టిన చరిత్ర కేసీఆర్ దని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ హయాంలోనే వ్యవసాయం సక్రమంగా సాగక, అప్పుల పాలై 6 నుంచి 8 వేల మంది రైతులు ఆత్మహత్యలు చేసుకోవాల్సి వచ్చిందని ఆరోపించారు. 2017లో రాజన్న సిరిసిల్ల జిల్లాలో అక్రమ ఇసుక రవాణాపై ప్రశ్నించిన రైతులను, దళితులను పోలీసుల చేత కొట్టించి థర్డ్ డిగ్రీ ఇప్పించిన చరిత్ర మీ పార్టీ సొంతమన్నారు. ఉదండాపూర్ భూ నిర్వాసితులకు పరిహారాలు ఇవ్వకుండా వేధించిన చరిత్ర వీళ్ళకు ఉందన్నారు. నాలుగు విడతల్లో రుణమాఫీ అంటూ అసంపూర్తిగా రుణమాఫీ చేస్తే అది రైతుల వడ్డీలకు కూడా సరిపోలేదని పేర్కొన్నారు. రైతుల కోసం నిరంతరం సేవలు అందిస్తూ అన్ని విధాల ఆదుకుంటున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి జోలికి వస్తే ఊరుకునేది లేదని ఈ సందర్భంగా కేటీఆర్ ను ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మహబూబ్ నగర్ ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు.



# హెల్త్ క్యాంప్ ను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ బోకుల శ్రీరాములు



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం మక్తగూడ గ్రామంలో గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న 99 ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక హెల్త్ కార్యక్రమం లో భాగంగా మక్తగూడ గ్రామంలో మెగా హెల్త్ క్యాంప్‌ను సర్పంచ్ బోకుల శ్రీరాములు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో గ్రామ ప్రజలకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించడంతో పాటు అవసరమైన మందులను కూడా పంపిణీ చేశారు రక్తపోటు షుగర్ గుండె సంబంధిత సమస్యలు మహిళల ఆరోగ్య పరీక్షలు చిన్నారుల ఆరోగ్య పరీక్షలు వంటి విభాగాల్లో ప్రత్యేక వైద్యులు సేవలు అందించారు.కార్యక్రమాన్ని ఉద్దేశించి సర్పంచ్ బోకుల శ్రీరాములు మాట్లాడుతూ,ప్రజల ఆరోగ్యమే ప్రభుత్వానికి ప్రధాన ప్రాధాన్యత అని అన్నారు.గ్రామీణ ప్రాంత ప్రజలు చిన్న ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయకుండా ఇలాంటి వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని పిలుపునిచ్చారు.గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై వైద్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు.కార్యక్రమంలో వార్డు సభ్యులు బొకుల రాజు,కె కృష్ణ,చందర్,రాందాస్ నాయక్,డి శ్రీను,అంజయ్య,డి మల్లేష్,గ్రామ సెక్రెటరీ,కొత్తూరు హెల్త్ ఆఫీసర్ దీప్తి,ఆశ వర్కర్లు జయమ్మ,లక్ష్మివైద్య సిబ్బంది గ్రామ పెద్దలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# షాద్ నగర్ కా షాన్ "ప్రతాపన్న"కు నామినేటెడ్ పదవీ ఏది..?

**నామినేటెడ్ పదవులు పండగ మళ్లీ మొదలైంది..**

**మొత్తం 17 కార్పొరేషన్లకు చైర్మన్లు,11 వైస్ చైర్మన్లను ప్రకటించిన ప్రభుత్వం..**

**షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డికి మళ్లీ మొండిచేయి..**

**పుణ్యకాలం దాటిపోయాక చేసేది ఏమీ ఉండదు..!**

**మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి పై పార్టీలో తిరుగుతున్న సానుభూతి..**



**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
తెలంగాణ రాష్ట్రంలో నామినేటెడ్ పదవుల పండగ మళ్లీ ఒకసారి మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటికే పలు దఫాలుగా కొన్ని నామినేటెడ్ పోస్టులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భర్తీ చేసిన విషయం తెలిసిందే. తాజాగా పలు కార్పొరేషన్లకు టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ చైర్మన్లను ప్రకటించారు. మొత్తం 17 కార్పొరేషన్లకు చైర్మన్లు,11వైస్ చైర్మన్లను ప్రకటించారు. అయితే రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డికి మాత్రం ఈసారి కూడా నామినేట్ పదవి తగ్గలేదు. నామినేటెడ్ పదవి వరిస్తుందని ఆయన అభిమానులు సన్నిహితులు పెద్ద ఎత్తున ఆశలు పెట్టుకున్నారు. మంచి రాజకీయ పరిజ్ఞానంతో పాటు కాంగ్రెస్ పార్టీ విజయానికి పార్టీ మనుగడకు ఆయన సేవలు నిరంతరం అవసరం ఉన్నాయి.గత అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా శంషాబాద్ లోని ఆయన ఇంటికి వెళ్లి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఆనాటి రాజకీయ సమీకరణాలలో భాగంగా ఆయనను పార్టీలో కలుపుకునేందుకు స్వయంగా ఇంటికి వచ్చి కండువా వేసి ఆయన రాజకీయ భవిష్యత్తు గురించి ప్రస్ఫుటమైన హామీని ఇచ్చారు. కార్పొరేషన్ చైర్మన్ పదవులు కీలక భూమిక పోషించే విధంగా ఆయనకు మంచి పదవియోగం ఉంటుందని చెప్పారు.కానీ ప్రభుత్వం ఏర్పడి రెండు సంవత్సరాలు దాటిపోయిన ఇప్పటివరకు మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డికి పదవియోగం మాత్రం దక్కలేదు. గతంలో ఈ పరిస్థితిని అధిగమించడానికి ప్రస్తుత ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వరంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ స్వయంగా తన లేఖతో పార్టీ వ్యవహారాల ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్, అదేవిధంగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ లకు సిఫార్సు చేశారు. ఆ తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి స్థానిక ఎమ్మెల్యే అదే విధంగా మరో సీనియర్ నేత టి. కాశీనాథ్ రెడ్డితో కలిసి కుల సందర్భాల్లో ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అయితే నామినేటెడ్ పోస్టు పై ప్రతాప్ రెడ్డికి భరోసా ఇచ్చిన వ్యవహారం కూడా ఉంది. అయినప్పటికీ మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ శీతకన్ను ఎందుకు వేశారో అర్థం కాని పరిస్థితి నెలకొందని ఆయన అభిమానులు బాధపడుతున్నారు. కాంగ్రెస్ పార్టీలో సమన్వయ కమిటీ బాధ్యతలు చేపడుతూ అంతకుముందు సర్పంచ్ ఎన్నికలు ఆ తర్వాత జరిగిన మున్సిపాలిటీ ఎన్నికల్లో కూడా మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి రాజకీయ మార్క్ స్పష్టంగా కనిపిస్తుంది. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ కు చేదోడు వాదోడుగా కూడా ప్రతాప్ రెడ్డి ఉంటున్నారు. సౌమ్యుడిగా నిశ్శబ్ద విప్లవం సృష్టించే మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి విషయంలో అధిష్టానం ఎందుకు అలసత్వం వహిస్తుంది అన్న అబఖ్యాతి మాత్రం మూటగట్టుకుంటుంది. నామినేటెడ్ పదవుల భర్తీ విషయంలో ప్రతాప్ రెడ్డికి తీవ్ర అన్యాయమే జరుగుతుందని ఆయన అభిమానులు మండిపడుతున్నారు.ప్రస్తుత కర్తవ్యం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అధిష్టానంతో సంప్రదింపులు జరుపుతారా లేదా తెలియాల్సి ఉంది. ఇది ఇలాగే కొనసాగితే రాజకీయ విభేదాలు ఉన్నట్లు జనాలకు సంకేతాలు అందే అవకాశం ఉంది. మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి విషయంలో ఇకనైనా సీరియస్ గా దృష్టి సారించకపోతే కాంగ్రెస్ పార్టీకి నష్టం వాటిల్లక తప్పదని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఇప్పటికే సగం పుణ్యకాలం దాటిపోయింది. మరో రెండు సంవత్సరాలు మాత్రమే పాలన మిగిలి ఉంది. వచ్చే ఎన్నికల నాటికి పరిస్థితులు ఎలా ఉంటాయో అంచనా వేలేని పరిస్థితి.చివరి రోజుల్లో బుజ్జగింపు కోసం నామినేటెడ్ పదవి కట్టబెట్టినా దానివల్ల పెద్ద ప్రయోజనం ఉండదని భావిస్తున్నారు. పుణ్యకాలం దాటిపోయాక కంటి తూర్పు చర్యలు కూడా సమంజసం కావు అని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి రాజకీయ పరిస్థితిపై అనుస్థితి నిలవడంతో పాటు సానుభూతి నెలకొంది.

# "అమ్మ" నీ దర్శనానికి కూడా వ్యాపారం చేసేసారు

## ఉచిత దర్శనం లేని మైసిగండి దేవాలయం..

**అభివృద్ధి పేరుతో ఆలయాన్ని వ్యాపారంగా మార్చేశారా.?**

**భక్తులకు చిటికెడు ప్రసాదం పెట్టారు, తాగడానికి నీళ్లు లేవు..**


**ఆలయ అభివృద్ధి కోసం ప్రభుత్వం 5 కోట్లు ఇచ్చిన అభివృద్ధి ఎక్కడా.?**

**దేవాలయాలను భక్తులకు దూరం చేయడానికేనా ఉచిత దర్శనం తీసేశారు**

**దశాబ్దాలుగా పాతుకుపోయిన సిబ్బంది, అధికారుల బదిలీలు ఉండవా.?**

**ఎవరి సొంత లాభం కోసం అధికారుల సిబ్బంది బదిలీలు లేవు..**

**దేవాలయాల సమస్యలను గాలికి వదిలేసిన మంత్రి కొండా సురేఖ..**




**కడ్తాల్,(ప్రజావినికిడి):** రంగారెడ్డి జిల్లాలోనికడ్తాల్ మండలంలోని మైసిగండి శ్రీ మైసమ్మ దేవాలయం భక్తి, విశ్వాసానికి నిలయంగా ఉండాల్సిన ఈ పవిత్ర క్షేత్రం ఇప్పుడు నిర్వాహకుల నిర్లక్ష్యం, అధికారుల అజాగ్రత్తతో భక్తుల ఆగ్రహానికి గురవుతుంది. ఎండోమెంట్ అధికారులు కావాలని ఉచిత దర్శనం అందుబాటులో లేకుండా చేసి, భక్తులను చెల్లింపు దర్శనాల వైపు మళ్లిస్తుండడంతో భక్తుల తీవ్ర ఆగ్రహానికి దారి తీస్తోంది. దేవాలయం అంటే వ్యాపారమా.? అంటూ భక్తులు ప్రశ్నిస్తున్నారు.

ఉచిత దర్శనం అనుకొని భక్తులు వస్తుంటే ఒక్కసారిగా టికెట్ తీసుకోవాలంటూ సిబ్బంది చెప్పడంతో భక్తులు ఆశ్చర్యానికి గురవుతున్నారు. ఉచిత దర్శనం లేదా అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ఈ ఆలయానికి ప్రతి ఆదివారం విపరీతంగా భక్తులు వస్తారు ఆలయం అభివృద్ధి పేరుతో వసూలు చేస్తున్న డబ్బులు ఆలయానికి చెందుతున్నాయా.? మరి ఇన్ని సంవత్సరాలుగా భారీ స్థాయిలో భక్తులను అభివృద్ధి పేరుతో పిండి వసూలు చేస్తున్న డబ్బు ఆలయానికి చెందితే ఎందుకు పూర్తిస్థాయిలో అభివృద్ధి కావడం లేదని ప్రభుత్వం ఇచ్చిన నిధులు ఖర్చు చేస్తుంటే మరి పూర్తిస్థాయిలో ఎన్ని సంవత్సరాల నుండి ఎందుకు అభివృద్ధి కాలేదో పాలకులకు, ఉన్నత అధికారులకే తెలియాలి. సామాన్య భక్తులకు పది రూపాయల తో దర్శనం కష్టంగా మారగా, డబ్బున్నవారికి మాత్రం ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్న తీరు తీవ్ర విమర్శలకు గురవుతోంది.

### కనీస సౌకర్యాలు కరువు..

మైసిగండి ఆలయ ప్రాంగణంలో కనీస సౌకర్యాలు లేకపోవడం మరింత ఆందోళన కలిగిస్తోంది. వేసవి వేడిలో భక్తులకు తాగునీరు కూడా అందుబాటులో లేకపోవడం దారుణమని భక్తులు అంటున్నారు. మూడు నాలుగు చోట్ల తాగడానికి నీళ్లు ఏర్పాటు చేయకుండా కేవలం ఒక దగ్గర ఏర్పాటు చేసి చేతులు దులుపుకోవడం ఈవో నిర్లక్ష్యమని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాంగణం పరిశుభ్రత పూర్తిగా లోపించడంతో ఎలుకలు, పందికొక్కులు సంచరిస్తున్న దృశ్యాలు భక్తులను కలవరపెడుతున్నాయి.సిబ్బంది అధికారుల నిర్లక్ష్యంతో దేవాలయం పవిత్రత ఎక్కడో మాయమైపోయిందనే భావన కలుగుతోంది.

ప్రభుత్వం ఆలయ అభివృద్ధి కోసం రూ.5 కోట్లు కేటాయించినప్పటికీ, ఆ నిధులు ఎక్కడ వినియోగించారో స్పష్టత లేకపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.. అభివృద్ధి పనుల జాడ కనిపించకపోవడంతో ఆ డబ్బు ఎక్కడికి పోయింది.? అనే ప్రశ్నలు భక్తుల్లో ఉత్పన్నమవుతున్నాయి. ఖర్చులపై పారదర్శకత లేకపోవడం, ఎస్టిమేషన్ అధికంగా వేయడం, ఎండోమెంట్ శాఖ పనితీరుపై సందేహాలు రేకెత్తిస్తోంది.

### కమీషనర్ ఆదేశాలు బేఖతార్..

ఎండోమెంట్ శాఖాలో కమిషనర్ ఆదేశాలను ఒక్క ఈవో కూడా అమలు చేయకపోవడం ఆశ్చర్యానికి గురిచేస్తుంది. కమిషనర్ ఆదేశాలు అంటేనే చెత్త బుట్ట దాఖలు అన్నట్లుగా మారిపోయింది పరిస్థితి. తెలంగాణ వ్యాప్తంగా దేవాదాయ ధర్మాదాయ శాఖలో ఉన్న

ప్రతి దేవాలయంలో ప్రతి భక్తునికి ప్రసాదం అందించాలని కమిషనర్ స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ, అవి కేవలం కాగితాలకే పరిమితమయ్యాయని విమర్శలు వినిపిస్తున్నాయి. మైసిగండి ఆలయంలో ఈవో స్నేహలత కమిషనర్ ఆదేశాలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమయ్యారని భక్తులు ఆరోపిస్తున్నారు. ఎంతో భక్తి భావంతో వస్తున్న భక్తులకు కనీసం చిటికెడు ప్రసాదం అందక నిరాశతో వెళ్తున్న భక్తుల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది.

### సిబ్బంది,అధికారుల దురుసు ప్రవర్తన..

ఆలయానికి భక్తితో కొంతమంది, మొక్కులతో కొంతమంది, కష్టాలు తీర్చుకోవడానికి కొంతమంది ఇలా అనేక రకాలుగా భక్తులు వస్తారు.

ఇక సిబ్బంది వ్యవహార శైలి, దురుసు ప్రవర్తన, భక్తులను దూషించడం పై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దశాబ్దాలుగా అదే స్థానాల్లో తిష్ట వేసి కూర్చున్న అధికారులు, సిబ్బంది తమ స్వప్రయోజనాలకే పరిమితమయ్యారని భక్తుల నుండి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.అసలు బదిలీలు లేకపోవడంతో అవినీతి,నిర్లక్ష్యం పూర్తిగా పెరుగుతోందని స్థానికులు అంటున్నారు.

### ఆలయానికి వచ్చే ఆదాయం ఎంత.? ఎటు వెలుతోంది.?

మైసిగండిఆలయానికి వచ్చే ఆదాయం ఎంత.? అందులో ఎంత మొత్తం ఎండోమెంట్ శాఖకు వెళ్తోంది.? ఎంత మేర ఆలయ అభివృద్ధికి వినియోగం జరుగుతోంది.? అనే అంశాలపై స్పష్టమైన లెక్కలు వెల్లడించకపోవడం మరింత అనుమానాలకు దారి తీస్తోంది. ఆదాయం పెరుగుతున్నప్పటికీ,భక్తులకు సౌకర్యాలు మాత్రం రోజురోజుకు శూన్యంగా ఉండటం విస్మయం కలిగిస్తోంది.

ఇలాంటి పరిస్థితుల్లో కూడా దేవాదాయ శాఖ




మంత్రి, ఉన్నతాధికారులు చోద్యం చూస్తుండటం, ఆకస్మిక తనిఖీలు చేయకపోవడం తీవ్ర విమర్శలకు గురవుతోంది. దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ ఆలయాల పర్యవేక్షణను పూర్తిగా విస్మరించారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మొత్తానికి మైసిగండి ఆలయం పరిస్థితి చూస్తే,భక్తి కంటే వ్యాపారమే ప్రాధాన్యంగా మారిందనే భావన కలుగుతోంది. వెంటనే అధికారులు స్పందించి,ఉచిత దర్శనం పునరుద్ధరించడం, పాలనలో పారదర్శకత తీసుకురావడం, భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడం అత్యవసరంగా మారింది.లేకపోతే భక్తుల ఆగ్రహం మరింత ఉధృతమయ్యే అవకాశం ఉంది.








# పేదల ముంగిటకే 'ప్రజాపాలన'

## అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు -మే నెలాఖరుకు రెండో విడత మంజూరు

**35 రోజుల్లోనే సాదా బైనామా సమస్యల పరిష్కారం- రైతులకు రుణమాఫీ, మద్దతు ధరతో కొండంత అండ**

**గువ్వలగూడెం ప్రజాదర్బార్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

**నేలకొండపల్లి, (ప్రజావినికిడి):** రాష్ట్రంలో పేదల సంక్షేమం, రైతుల అభ్యున్నతే ధ్యేయంగా ప్రజా ప్రభుత్వం అడుగులు వేస్తోంది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే అవస్థలు లేకుండా, పాలనను నేరుగా వారి గడప వద్దకే తీసుకువచ్చాం" అని తెలంగాణ రెవెన్యూ,గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి స్పష్టం చేశారు. బుధవారం ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం గువ్వలగూడెం గ్రామంలో నిర్వహించిన 'ప్రజాపాలన – ప్రజాదర్బార్' కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.ఎంపీ రఘురాంరెడ్డి, కలెక్టర్ దివాకరతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.

**రైతు పక్షపాతి మన ప్రభుత్వం...**

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ,గత పాలకుల నిర్లక్ష్యం వల్ల రైతాంగం అనేక ఇబ్బందులు ఎదుర్కొందని విమర్శించారు. "నాడు వరి వేస్తే ఉరి అన్న పరిస్థితి ఉండేది. కానీ నేడు ప్రతి గింజనూ మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్నాం. సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 అదనపు బోనస్ ఇస్తున్నాం" అని పేర్కొన్నారు. ఇప్పటికే రూ.21 వేల కోట్ల రుణమాఫీతో 25 లక్షల మంది రైతులకు విముక్తి కల్పించామని, రైతు భరోసా కింద ఎకరానికి రూ.12 వేల సాయం






అందిస్తున్నామని వివరించారు.

**సొంతింటి కల సాకారం...**

ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఇళ్లు లేని నిరుపేదలకు గృహ కల్పన చేయడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పునరుద్ఘాటించారు. "ఇప్పటికే పెద్ద ఎత్తున ఇళ్లు మంజూరు చేశాం. మే నెలాఖరు నాటికి రెండో విడత ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తాం" అని ప్రకటించారు.భూ సమస్యలను 'భూ భారతి' ద్వారా ప్రక్షాళన చేస్తున్నామని, పెండింగ్‌లో ఉన్న సాదా బైనామా దరఖాస్తులను రాబోయే 35 రోజుల్లో ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.

**మహిళా సాధికారతే లక్ష్యం...**

రాష్ట్రంలోని కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలన్నదే ప్రభుత్వ సంకల్పమని మంత్రి తెలిపారు. మహాలక్ష్మి పథకం ద్వారా ఉచిత బస్సు ప్రయాణం, సన్న బియ్యం సరఫరా వంటి పథకాలు పేద కుటుంబాల్లో వెలుగులు నింపుతున్నాయని అన్నారు. ప్రజాదర్బార్‌లో అందిన ప్రతి న్యాయబద్ధమైన దరఖాస్తును గరిష్ఠంగా మూడు నెలల వ్యవధిలో పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రాంప్రసాద్,ఆయా గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మమతా బెనర్జీ అహంకారం!

**మే 6(ప్రజావినికిడి):**
ప్రజాస్వామ్యంలో నిరంకుశంగా ఉంటామంటే కుదరదు. ప్రజలు ఎన్నుకుంటే నేతలు..లేదంటే అంతే సంగతులు. భారత ప్రజాస్వామ్యంలో ఎవరైనా రాజ్యాంగ బద్దంగా ఉండాల్సిందే. కాదూకూడదంటే... కుదరదు. ఇటీవల ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు ముగిసి..ఫలితాలు కూడా వచ్చేశాయి, బెంగాల్లో బిజెపి అధికారం చేపట్టబోతోంది. తమిళనాడులో నటుడు విజయ్ స్థాపించిన టివికె పార్టీ అధికారం దక్కించు కుంది. ఇంతవరకు ఇవే పెద్ద మార్పులు. కేరళలో ఎల్‌డిఎఫ్ స్థానంలో యూడిఎఫ్ అధికారం కైవసం చేసుకుంది. అసోం, పాండిచ్చేరిల్లో పాత ప్రభుత్వాలే కొత్తగా కొలువుదీర బోతున్నాయి. ఈ క్రమంలో బెంగాల్లో గత పదేహేనేళ్ల మమతా బెనర్జీ పాలనలో అనేక అరాచకాలను చూశాం. తానూ బంగ్లాదేశ్‌లో లాగా ఓ దేశానికి రాణిని అని భ్రమిశారు. అడ్డూ అదుపులేకుండా ఆరాచకాలకు తెలేపారు. చొరబాటుదార్లకు గేట్లు తెరిచారు. ఆధార్ కార్డులు, రేషన్ కార్డులు ఇచ్చి వారిని పర్మినెంట్‌గా ఓటర్లను చేశారు. కానీ సర్ ప్రక్రియతో ఆమె ఆటలు సాగలేదు. అలాగే ఆమె తీరుతో ప్రజల్లో గూడుకట్టుకున్న ఆగ్రహం కట్టలు తెంచుకుంది. ఓట్ల రూపంలో తమ తీర్పును తెలిపారు. 95 శాతం మంది, అందులో మహిళల క్యూలు కట్టి మమతను ఓడించారు. ప్రజల తీర్పును గౌరవించాల్సిన మమతా బెనర్జీ తాను ఓడిపోలేదని, రాజీనామా చేయలనని, బిజెపి వందసీట్లు చోరీ చేసిందని దగుల్బాజీ మాటలు మాట్లాడారు. అసోం, బెంగాల్లో ఓట్ చోరీ జరిగిందని రాహుల్ కూడ వంతపాడారు. మరి తమిళనాడు, కేరళలో ఓట్



చోరీ ఎదుకు జరగలేదో రాహుల్ చెప్పాలి. రాహుల్ ఓట్ చోరీ పేరుతో ఇంకా నాటకాలు ఆడితే ప్రజలు క్షమించరని గుర్తించాలి. విపక్షనేత కూడా మతిభ్రమించి మాట్లాడడం అలవాటు చేసుకున్నారు. మమత బెనర్జీ తాను ఇండియాలో ఉన్న వెస్ట్ బెంగాల్ ముఖ్యమంత్రిగా పనిచేశానని అనుకోవడం లేదు. బంగ్లాదేశ్‌లాగా తనది కూడా స్వతంత్ర రాజ్యం అనుకుంటున్నారు. అందుకే రాజ్యంగం విలువ తెలియకుండా మాట్లాడుతున్నారు .ఆ రాజ్యంగమే ఆమెను 15 ఏళ్లపాటు సిఎంగా మోసిందని గుర్తించడం లేదు. ఓటమితో మమతలో అసహనం పెరిగింది. ఏం మాట్లాడాలో తెలియడం లేదు. రాహుల్ ఓట్‌చోరీని సీట్ల చోరీతో పోల్చి మాట్లాడారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల్లో బీజేపీ కుట్రలతోనే గెలిచిందని మమతా బెనర్జీ అంటున్నారు. బీజేపీకి ఈసీ ఏజెంట్‌గా మారిందని ఆక్షేపణ తెలిపారు. ఈ ఎన్నికలో ప్రధాన విలన్ ఎన్నికల సంఘమేనని విమర్శలు గుప్పించారు. 100పైగా సీట్లు లూటీ చేశారని, తాను ఎన్నికల్లో ఓడిపోలేదని చెప్పారు. అందువల్ల తాను రాజీనామా చేసే ప్రసక్తి కూడా లేదన్నారు. రాజ్‌భవన్‌కు వెళ్లనని, రాజీనామా చేయమని తనను ఎవరూ ఒత్తిడి చేయలేరని స్పష్టం చేశారు. పశ్చిమబెంగాల్ ఎన్నికల ఫలితాల అనంతరం తొలిసారి మీడియా సమావేశంలో మంగళవారం నాడు మమతాబెనర్జీ మాట్లాడుతూ..రాజ్యాంగ వ్యతిరేక వ్యాఖ్యలు చేశారు. రాజీనామా చేయకుంటే బర్తరఫ్ చేస్తారని అసోం ముఖ్యమంత్రి హిమంతబిశ్వ శర్మ గట్టిగానే హెచ్చరించారు. 15 ఏళ్లపాటు ఇవిఎంలతోనే మమత గెలిచారు. ఇప్పుడేమో ..ఈ ఎన్నికల్లో విలన్‌గా ప్రధాన ఎన్నికల కమిషనర్ వ్యవహరించారు. బెంగాల్‌లో ఈవీఎంలను లూటీచేశారని ఆరోపించడం చూస్తే మతి భ్రమించిందనే అనుకోవాలి. ఉద్దేశ్య పూర్వకంగానే ఒక ప్లాన్ ప్రకారం తనను ఓడించారని, ఎన్నికల కమిషన్‌ను దుర్వినియోగపరిచి బీజేపీ విజయం సాధించిందని, తన జీవితంలో ఎప్పుడూ ఇలాంటి ఎన్నికలు చూడలేదని కూడా చెప్పుకొచ్చారు. కౌంటింగ్ సెంటర్లలో టీఎంసీ కార్యకర్తలను కొట్టారని, తనను 'సీఆర్‌పీఎఫ్ గూండాలు' పొత్తికడుపులో తన్ని కౌంటింగ్ సెంటర్ నుంచి గెంటేశారని తీవ్రారోపణలు చేశారు. ఎస్ఐఆర్ నుంచి 90 లక్షల ఓట్లను తొలగించా రనీ, కోర్టుకు వెళ్లడంతో 32 లక్షల ఓట్లు చేర్చారని, టీఎంసీని ఓడించేందుకు అన్నిరకాలుగా ఎత్తుగడలు
పన్ని 100 సీట్ల వరకూ బీజేపీ లూటీ చేసిందని విమర్శించారు. నిజానికి గతంలో మమతా బెనర్జీ పకడ్బందీగా ఇవన్నీ చేశారు. మమతను సుప్రీం కూడా చీవాట్లు పెట్టింది. అయినా ఆమెలో మార్పు రాలేదు. ఆమెను 15 ఏళ్లు భరించడమే ఎక్కువ. ఇలాంటి నేతలు ఉన్నందుకు సిగ్గుపడాలి. ఉమ్మడిగా పోరాటం కోసం తాను 'ఇండి' కూటమిలోనే తాను కొనసాగుతానని కూడా స్పష్టం చేశారు. అందుకేనేమో రాహుల్ కూడా ఆమె పట్ల సానుభూతి ప్రకటించారు. కేరళ, తమిళనాడు తప్ప అంతా ఓట్ చోరీ జరిగిందని పాత ఆవుకథను మళ్లీ పదేపదే చెప్పారు. నిజానికి పశ్చిమబెంగాల్, తమిళనాడు, కేరళం రాష్ట్రాల్లో పాలక పార్టీల, కూటములను ప్రజలు ఓడించి మార్పును కోరుకున్నారు. దేశంలో ఎక్కడా ఉనికిని పెంచుకోలేక పోయిన కాంగ్రెస్‌కు కేరళంలో గెలుపు కొత్త ఊరటనిచ్చేదిగా ఉంది. కేరళంలో వరుసగా రెండు తడవలు అసాధారణంగా గెలిచిన వామపక్ష ప్రజాతంత్ర సంఘటన (ఎల్‌డిఎఫ్) ప్రభుత్వం ఓడిపోవడం అన్నది క ఊడా ప్రజలు కోరుకున్న మార్పులో భాగమే. అంతే తప్ప కాంగ్రెస్ మీద ప్రేమతో కాదు. ఇకపోతే
తమిళనాడు ఫలితం అనూహ్యం. ప్రముఖ సినీ నటుడు విజయ్ కొత్తగా పెట్టిన టివికె పార్టీకి వందకుపైన సీట్లొచ్చాయి. మరికొందరిని కలుపుకొని ఆయనే కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయబోతున్నారు. మరి ఇక్కడ బిజెపి ఓటు చోరీ చేయలేకనా అన్నది మమతా బెనర్జీ చెప్పాలి. రెండేళ్ల కింద జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో డిఎంకె కూటమి క్లీన్ స్వీప్ చేసింది. అంతలోనే డిఎంకెపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడానికి రాజకీయ సమీకరణాలు, సామాజిక అంశాలు ప్రముఖంగా పని చేశాయని అర్థమవుతుంది. బిజెపి ఎంతగా పాకులాడినా తమిళనాట ప్రాంతీయ పార్టీలనే ప్రజలు ఆదరించారు. పశ్చిమబెంగాల్‌లో మమత పార్టీ టిఎంసి అవినీతిమయమైంది. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో, శాంతి భద్రతలను పరిరక్షించడంలో ఘోరంగా విఫలమైంది. బంగ్లాదేశ్ నుంచి అక్రమ చొరబాటు అంశాన్ని రాజకీయంగా ఉపయోగపెట్టుకుంది.
ఇవన్నీ మరచిన మమత తానేదో పునీతురాలినని చెప్పుకోవడం, సిఎంగా రాజీనామా చేయనని ప్రకటించుకోవడం అహంకారంతో కూడిన అవివేకానికి నిదర్శనం. అలా చేస్తే బర్తరఫ్ చేయడం తప్ప మరోమార్గం ఉండదు.

## యూపిలో దారుణ ఘటన

### బాలుడిపై అత్యాచారం హత్య -దుండగుడిని కాల్చి చంపిన పోలీసులు

**లక్నో,మే 6(ప్రజావినికిడి):**
ఓ కామాంధుడిని ఉత్తర్ ప్రదేశ్ పోలీసులు కాల్చి చంపేశారు. ఏడేళ్ల బాలుడిపై హత్యాచారం కేసులో ఎన్‌కౌంటర్ చేశారు. పక్కా సమాచారంతో నిందితుడిని పట్టుకునేందుకు వెళ్లగా పోలీసులపై దుండగుడు కాల్పులకు తెగపడ్డాడు. ఆత్మరక్షణ కోసం పోలీసులు ఎదురుకాల్పులు జరపగా కామాంధుడు హతమయ్యాడు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపుతోంది. మంగళవారం నాడు హర్దోయ్ జిల్లా మతియమౌలోని మొక్కజొన్న పొలంలో ఏడేళ్ల బాలుడి మృతదేహం లభ్యమైంది. చిన్నారిని అపహరించిన మెహనూర్ (32) అత్యాచారం చేశాడు. అనంతరం హత్య చేసి మృతదేహాన్ని అక్కడే పడేశాడు. ఈ నేరాన్ని లైంగిక దాడిగా కాకుండా డబ్బుల కోసం చేసిన కిడ్నాప్‌గా చిత్రీకరించేందుకు నిందితుడు ప్రయత్నించాడు. ఈ మేరకు దొంగిలించిన సిమ్ కార్డు సహాయంతో బాధిత కుటుంబానికి ఫోన్ చేసి డబ్బులు డిమాండ్ చేశాడు. అయితే, వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మేరకు మెహనూర్‌పై రూ.50 వేల రివార్డును పోలీసులు ప్రకటించారు. అయితే, హర్దోయ్ జిల్లా మల్లావన్ ప్రాంతంలో నిందితుడు మెహనూర్ ఉన్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. అతన్ని పట్టుకునేందుకు స్థానిక పోలీసులు, స్పెషల్ ఆపరేషన్స్ గ్రూప్ సంయుక్త బృందాలు రంగంలోకి దిగాయి. నిందితుడు ఉన్న ప్రాంతానికి చేరుకుని అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేశాయి. ఈ సందర్భంగా మెహనూర్ ఏకంగా పోలీసులపైకే కాల్పులకు తెగపడ్డాడు. కామాంధుడి దాడిలో సీనియర్ ఎస్ఓజీ అధికారి రాజేశ్ కుమార్ తీవ్రంగా గాయపడ్డారు. ఆత్మరక్షణ కోసం పోలీసులు కూడా ఎదురుకాల్పులు జరపగా.. మెహనూర్ ప్రాణాలు కోల్పోయినట్లు పోలీస్ సూపరింటెండెంట్ అశోక్ కుమార్ తెలిపారు. అతని మృతదేహం వద్ద రెండు తుపాకులు దొరికినట్లు వెల్లడించారు. నిందితుడిని కన్నౌజ్ జిల్లావాసిగా గుర్తించినట్లు చెప్పారు. అతనికి నేర చరిత్ర ఉందని.. పలు జిల్లాల్లో దాదాపు పన్నెండు కేసులు మెహనూర్‌పై నమోదైనట్లు ఎస్పీ అశోక్ కుమార్ వెల్లడించారు.



-------------

## టివికెకు తమిళ కాంగ్రెస్ మద్దతు

**ఏఐసీసీ తమిళనాడు ఇన్‌ఛార్జ్ గిరీశ్ చోడంకర్ ప్రకటన**

**తిరుచ్చి సీటును వదులుకోబోతున్న విజయ్**

**ఆ స్థానంలో త్రిష పోటీ అంటూ సోషల్ మీడియా కూత**

**చెన్నైమే 6(ప్రజావినికిడి):**
తమిళనాడులో ప్రభుత్వం ఏర్పాటు చేసేందుకు టీవీకే పార్టీకి కాంగ్రెస్ అధికారిక మద్దతు ప్రకటించింది. బేషనరతుగానే ఈ మద్దుతును తెలిపింది. విజయ్ కోరకముందే కాంగ్రెస్ నిర్ణయం తీసుకోవడం ఆశ్చర్యంగా ఉంది. ఎక్కడ అన్నడిఎంకెను కలుపుకుంటారో అన్న భయం కాంగ్రెస్‌లో ఉంది. అందుకే విజయ్ నేతృత్వంలోని టీవీకేకు మద్దతు తెలుపుతూ ఏఐసీసీ తమిళనాడు ఇన్‌ఛార్జ్ గిరీశ్ చోడంకర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. మతతత్వ శక్తులను కూటమిగా దూరంగా ఉంచాలనే ప్రధాన లక్ష్యం తోనే ఈ మద్దతు ఇస్తున్నట్లు గిరీశ్ చోడంకర్ వెల్లడించారు. తమిళనాడులో లౌకిక, అభ్యుదయ, సంక్షేమ ప్రభుత్వాన్ని అందించడమే తమిళనాడు ప్రజల తీర్పు ఉద్దేశమని గిరీశ్ వ్యాఖ్యానించారు. కేవలం ప్రభుత్వ ఏర్పాటుకే కాకుండా భవిష్యత్తులో జరగబోయే స్థానిక సంస్థలు, లోక్‌సభ, రాజ్యసభ ఎన్నికల్లోనూ టీవీకేతో కలిసి పనిచేస్తామని ఆయన స్పష్టం చేశారు. దీంతో తమిళనాడులో కొత్త రాజకీయ సమీకరణాలకు
కాంగ్రెస్- టీవీకే పొత్తు తెరలేపినట్లు అయ్యింది. తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు మద్దతు అందించాలని భారత



జాతీయ కాంగ్రెస్‌ను అధికారికంగా కోరారు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడంలో టీవీకేకి తమ పూర్తి మద్దతు అందించాలని తమిళనాడు కాంగ్రెస్ కమిటీ, కాంగ్రెస్ శాసనసభ పక్షం నిర్ణయించాయి. భారత రాజ్యాంగంపై విశ్వాసం లేని ఏ మతతత్వ శక్తులను కూడా ఈ కూటమిలో చేర్చుకోకుండా టీవీకే దూరంగా ఉంచాలి. ఈ షరతుపైనే మా మద్దతు ఆధారపడి ఉంటుంది. రాబోయే సంవత్సరాల్లోనూ, దశాబ్దాల్లోనూ పెరియార్ సామాజిక న్యాయ ఆదర్శాలకు, డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ రాజ్యాంగ ఆదర్శాలకు దృఢమైన నిబద్ధతతో కట్టుబడి ఉంటాం. తమిళనాడులో పెరుంతలైవార్ కామరాజ్ హయాం నాటి రోజులను తిరిగి తీసుకురావడానికి టీవీకే, తమిళనాడు కాంగ్రెస్ మధ్య ఏర్పడిన ఈ కూటమి కృషి చేస్తుంది' అని ప్రకటనలో కాంగ్రెస్ ప్రస్తావించింది. ఇకపోతే టివికె గురువారం ప్రభుత్వ పగ్గాలు చేపట్టనుంది. ఈ క్రమంలో టాలీవుడ్, కోలీవుడ్‌లో గ్లామర్‌కు ప్రతీకగా నిలిచిన త్రిషా కృష్ణన్ రాజకీయ రంగప్రవేశం చేయబోతుందా? ప్రస్తుతం తమిళ రాజకీయాల్లో ఇదే హాట్ టాపిక్‌గా మారింది. టీవీకే అధినేత విజయ్ తీసుకోబోతున్న నిర్ణయాలు, జరుగుతున్న అంతర్గత చర్చలు ఈ ఊహాగానాలకు మరింత ఊపునిస్తున్నాయి. అద్భుతమైన రాజకీయ అరంగేట్రంతో తిరుచిరాపల్లి(తిరుచ్చి) ఈస్ట్, పెరంబూర్ నియోజకవర్గాల్లో ఘన విజయం సాధించిన విజయ్.. ఇప్పుడు ఒకచోట రాజీనామా చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆయన తిరుచ్చి ఈస్ట్ స్థానానికి రాజీనామా చేసి, పెరంబూర్ నియోజకవర్గాన్ని అట్టిపెట్టుకోనున్నట్టు తెలుస్తోంది. ఖాళీఅయ్యే ఆ స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలన్న దానిపై టీవీకేలో చర్చలు జోరందుకున్నాయి. అంతకంటే ముఖ్యంగా సోషల్ మీడియాలో పెద్ద డిబేట్సే నడుస్తున్నాయి. టీవీకే ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో తెలియదు గానీ.. సోషల్ మీడియాలో నెటిజన్లు మాత్రం బైపోల్ టికెట్ త్రిషకే అని కమిట్ అయిపోతున్నారు. సీఎం అవుతానంటూ గతంలో త్రిష కామెంట్స్ చేయడం.. ఇప్పుడు త్రిష రిలేషన్‌షిప్‌లో ఉన్నట్లుగా చెబుతున్న విజయ్ పార్టీ టీవీకే గెలుపొందడం.. విజయ్ పోటీ చేసిన రెండింటిలో ఒక చోట బైపోల్ వచ్చే అవకాశం ఉండటం.. వెరసి పరిస్థితులన్నీ త్రిష తన కలను నెరవేర్చుకునేందుకు సహకరిస్తున్నాయా? అని నెట్టింట పెద్ద చర్చే నడుస్తోంది. ప్రస్తుతానికి త్రిష తాను కలగన్నట్లుగా సీఎం అయ్యే అవకాశం లేదుగానీ.. విజయ్ తిరుచ్చి స్థానానికి రాజీనామా చేస్తే మాత్రం.. ఆ స్థానాన్ని త్రిషకు ఇస్తారని.. ఆమెను గెలిపించుకుని ప్రభుత్వంలో కీలక పోస్ట్ ఇస్తారనే ప్రచారమైతే జోరుగా సాగుతోంది. మొత్తంగా.. త్రిష నిజంగానే ఎన్నికల బరిలోకి దిగుతుందా? టీవీకే ప్రభుత్వంలో కీలక పాత్ర పోషిస్తుందా? లేక ఇవన్నీ కేవలం ఊహాగానాలుగానే మిగిలిపోతాయా? అన్నది తేలాలంటే మరికొంత కాలం వేచి చూడాల్సిందే.

-------------

## సినిమా పేరుతో 25 లక్షల మోసం

### సంగీత దర్శకుడు పలాశ్ మచ్చల్‌పై కేసు

**ముంబయి,మే 6(ప్రజావినికిడి):**
ప్రేమపేరుతో టీమిండియా స్టార్ క్రికెటర్ స్మృతి మంధాన ను మోసం చేసినప్రముఖ సంగీత దర్శకుడు పలాశ్ ముచ్చల్ పై మహారాష్ట్రలోని సాంగ్లీ పోలీసులు కేసు నమోదు చేశారు. స్మృతి మంధాన స్నేహితుడు విజ్ఞాన్ ప్రకాశ్ ఇచ్చిన ఫిర్యాదుతో ఈ పరిణామం చోటుచేసుకుంది. విజ్ఞాన్ ప్రకాశ్ తన ఫిర్యాదులో పలాశ్ ముచ్చల్‌పై తీవ్ర ఆరోపణలు చేశారు. ఒక సినిమా ప్రాజెక్టు కోసం పలాశ్ తన వద్ద నుంచి రూ. 25 లక్షలు తీసుకున్నారని, అయితే ఆ తర్వాత తనను మోసం చేశారని విజ్ఞాన్ పేర్కొన్నారు. గత ఏడాది నవంబరు 22న ఈ విషయంలో వారిద్దరి మధ్య వాగ్వాదం జరిగిందని, ఆ సమయంలో పలాశ్ తన కులాన్ని ఉద్దేశించి అసభ్య పదజాలంతో దూషించారని ఫిర్యాదులో వివరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సాంగ్లీ పోలీసులు పలాశ్ ముచ్చల్‌పై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ప్రస్తుతం పోలీసులు ఈ కేసును విచారిస్తున్నారు. దీనిపై పలాశ్ ముచ్చల్ ఇంకా అధికారికంగా స్పందించాల్సి ఉంది. పలాశ్ ముచ్చల్ వ్యక్తిగత జీవితం కూడా గత కొంతకాలంగా వార్తల్లో నిలుస్తోంది. ఆయన, క్రికెటర్ స్మృతి మంధాన మధ్య నిశ్చితార్థం జరిగి, పెళ్లి కూడా ఎ÷-లాన్ అయినప్పటికీ అనూహ్యంగా అది రద్దయినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై అప్పట్లో సోషల్ మీడియాలో అనేక ఊహాగానాలు వెలువడ్డాయి. వాటిపై స్పందించిన పలాశ్, ఆధారాలు లేని వార్తలను నమ్మవద్దని, తన వ్యక్తిగత జీవితంపై అనవసర వ్యాఖ్యలు చేయొద్దని పేర్కొన్నారు. అయితే తాజాగా నమోదైన అట్రాసిటీ కేసుతో పలాశ్ ముచ్చల్ చట్టపరమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కేసు విచారణలో మరిన్ని విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని పోలీసులు చెబుతున్నారు.



-------------

## సామాన్య మహిళగా బస్టాండ్‌లో సీపీ సుమతి...

**పోకిరీల ఆటకట్టు**

**ఆకతాయిల ఆగడాలు అరికట్టేందుకు సీపీ సుమతి స్పెషల్ ఆపరేషన్**


**సాధారణ మహిళగా బస్టాండ్‌లో ఒంటరిగా నిలబడిన సీపీ**

**ఆమెను వేధించిన సుమారు 40 మంది యువకులు**

**పట్టుబడిన వారిలో ఎక్కువ మంది విద్యార్థులే**

**అందరినీ అదుపులోకి తీసుకుని కౌన్సెలింగ్ ఇచ్చిన పోలీసులు**

**మల్కాజిగిరిమే 6 (ప్రజావినికిడి):**
మల్కాజిగిరి పోలీస్ కమిషనర్‌గా ఇటీవల బాధ్యతలు చేపట్టిన బి. సుమతి ఆకతాయిల ఆగడాలపై ఉక్కుపాదం మోపారు. ఈవ్ టీజింగ్‌ను అరికట్టేందుకు తానే స్వయంగా రంగంలోకి దిగి,






అర్ధరాత్రి ఓ బస్టాండ్‌లో సామాన్య మహిళగా నిలబడ్డారు. ఆమెను గుర్తుపట్టని పోకిరీలు వేధించడంతో, అక్కడే మాటువేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.
వివరాల్లోకి వెళితే.. అర్ధరాత్రి మల్కాజిగిరి పరిధిలోని ఓ బస్టాండ్‌కు సీపీ సుమతి ఒంటరిగా చేరుకున్నారు. ఆమె ఉన్నతాధికారి అని తెలియని సుమారు 40 మంది పోకిరీలు ఆమె చుట్టూ చేరారు. రకరకాల ప్రశ్నలతో ఇబ్బంది పెట్టారు. ఈ క్రమంలో సాధారణ మహిళలు ఎదుర్కొనే వేధింపులను ఆమె స్వయంగా అనుభవించారు. పట్టుబడిన వారిలో ఎక్కువ మంది విద్యార్థులే ఉండటం ఆందోళన కలిగించే విషయం. ఆకతాయిల వేధింపులు శ్రుతి మించడంతో అక్కడికి చేరుకున్న ప్రత్యేక పోలీస్ బృందాలు వారిని అదుపులోకి తీసుకున్నాయి. అనంతరం యువకులందరికీ కౌన్సెలింగ్ ఇచ్చి, భవిష్యత్తులో ఇలాంటి పనులకు పాల్పడవద్దని హెచ్చరించి పంపించారు. మహిళల భద్రత విషయంలో కఠినంగా వ్యవహరిస్తామని సీపీ సుమతి ఈ ఆపరేషన్ ద్వారా స్పష్టమైన సంకేతాలు పంపారు.

# ఫైనల్ మ్యాచ్ వేదిక మార్పు..

ఐపీఎల్ 2026 ఫైనల్ మ్యాచ్ వేదిక అధికారికంగా ఖరారైంది. డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుహోమ్ గ్రౌండ్ అయిన బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియంలో జరగాల్సిన టైటిల్ పోరును బీసీసీఐ అనూహ్యంగా అహ్మదాబాద్‌కు మార్చింది. ప్రపంచంలోనే అతిపెద్ద క్రికెట్ మైదానంగా పేరొందిన నరేంద్ర మోదీ స్టేడియం మే 31న జరగనున్న ఫైనల్ మ్యాచ్‌కు ఆతిథ్యం ఇవ్వనుంది. వాస్తవానికి ప్రతి ఏడాదీ గతేడాది విజేతగా నిలిచిన జట్టు సొంత మైదానంలో ఫైనల్ నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. కానీ ఈ ఏడాది ఆ సంప్రదాయాన్ని పక్కనపెట్టారు. స్థానిక క్రికెట్ అసోసియేషన్, అధికారుల నుంచి వచ్చిన కొన్ని డిమాండ్లు తమ నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని, ఆ కారణం వల్లే ఫైనల్ వేదికను అహ్మదాబాద్‌కు మార్చామని బీసీసీఐ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. ఈ నిర్ణయం తీసుకున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవాజిత్ సైకియా వెల్లడించారు. ప్లేఆఫ్స్, ఫైనల్ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను బోర్డు బుధవారం విడుదల చేసింది. గత ఐదేళ్లలో అహ్మదాబాద్‌లో ఐపీఎల్ ఫైనల్ మ్యాచ్ జరగడం ఇది నాలుగోసారి కావడం విశేషం. మే 26 నుంచి ప్లేఆఫ్స్ మ్యాచ్‌లు మొదలుకానున్నాయి. వేదిక మార్పుపై బీసీసీఐ చేసిన ప్రకటనలో నిబంధనలకు విరుద్ధమైన డిమాండ్ల గురించి ప్రస్తావించారే తప్ప, అసలు కారణం ఏమిటో నేరుగా చెప్పలేదు. అయితే పలు నివేదికల ప్రకారం చూస్తే, స్థానిక రాజకీయ నాయకుల నుంచి వచ్చిన అసాధారణ డిమాండ్ల వల్లే ఈ మార్పు జరిగినట్లు స్పష్టమవుతోంది. ఆర్సీబీ, సన్‌రైజర్స్ హైదరాబాద్ మధ్య జరిగిన తొలి మ్యాచ్‌కు ముందే కాంగ్రెస్ ఎమ్మెల్యే విజయనంద్ కాశప్పనవర్




బహిరంగంగానే వీఐపీ పాస్‌ల డిమాండ్ తెరపైకి తెచ్చారు. ప్రజాప్రతినిధులమైన తాము క్యూలో నిలబడలేమని, ప్రతి ఎమ్మెల్యేకు కనీసం ఐదు ఐపీఎల్ టికెట్లు ఇవ్వాలని ఆయన పట్టుబట్టారు. ఆ తర్వాత వెంటనే కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ సైతం ఎంపీలు, ఎమ్మెల్యేలకు మ్యాచ్‌కు మూడు ఉచిత టికెట్ల చొప్పున కేటాయిస్తామని వెల్లడించారు. బీసీసీఐ ఈ వ్యవహారంపై నేరుగా స్పందించనప్పటికీ, వేదికను మార్చడం వెనుక ఉన్న అసలు కారణం ఇదేనని క్రీడా వర్గాల్లో బలంగా వినిపిస్తోంది. నల్ మ్యాచ్ కోసం అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియాన్ని ఎంచుకోవడానికి బలమైన కారణాలే ఉన్నాయి. అత్యధిక సీటింగ్ సామర్థ్యం ఉన్న ఈ మైదానం ఇప్పటికే ఎన్నో ప్రతిష్టాత్మక మ్యాచ్‌లకు విజయవంతంగా ఆతిథ్యం ఇచ్చింది. ఇక్కడ అత్యుత్తమ మౌలిక సదుపాయాలు ఉండటంతో పాటు, బయటి వ్యక్తుల నుంచి అనవసరమైన ఒత్తిళ్లు తక్కువగా ఉంటాయి. భారీ అంచనాలు ఉండే ఫైనల్ లాంటి మ్యాచ్‌ను సురక్షితమైన, నియంత్రిత వాతావరణంలో నిర్వహించడానికి బీసీసీఐకి ఇది సరైన వేదికగా మారింది. ఒక రకంగా చెప్పాలంటే, ఈ వేదిక మార్పు కేవలం సౌలభ్యం కోసమే కాకుండా, నిర్వహణపై తమకు పూర్తి పట్టు ఉండేలా బోర్డు తీసుకున్న జాగ్రత్తగా పరిగణించవచ్చు. ఐపీఎల్ 2026 ప్లేఆఫ్స్ పూర్తి షెడ్యూల్ ఈ విధంగా ఉంది. లీగ్ దశలో తొలి రెండు స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య మే 26న ధర్మశాలలోని హెచ్‌పీసీఏ స్టేడియంలో క్వాలిఫయర్-1 మ్యాచ్ జరగనుంది. ఆ తర్వాత మే 27న న్యూ చండీగఢ్‌లోని న్యూ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియంలో మూడో, నాలుగో స్థానాల్లో నిలిచిన జట్లు ఎలిమినేటర్ మ్యాచ్‌లో తలపడతాయి. అదే మైదానంలో మే 29న క్వాలిఫయర్-2 జరగనుంది. క్వాలిఫయర్-1లో ఓడిన జట్టు, ఎలిమినేటర్‌లో గెలిచిన జట్టు ఈ మ్యాచ్‌లో ఫైనల్ బెర్త్ కోసం పోటీపడతాయి. ఇక విజేతను నిర్ణయించే గ్రాండ్ ఫైనల్ మే 31న అహ్మదాబాద్‌లోని నరేంద్ర మోదీ స్టేడియంలో అట్టహాసంగా జరగనుంది. ఈ ప్లేఆఫ్స్ మ్యాచ్‌లను మూడు వేర్వేరు నగరాల్లో నిర్వహించడం ఈ సీజన్‌లో తీసుకున్న ప్రత్యేక నిర్ణయమని, బెంగళూరు వ్యవహారం వల్లే ఈ రకమైన మార్పులు చేయాల్సి వచ్చిందని బోర్డు వివరించింది.

# చరిత్ర సృష్టించిన సంజూ సామ్సన్..



ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 రసవత్తరంగా మారిపోయింది. లీగ్ దశ ఆఖరికి చేరుకున్నా.. 10 జట్లకు కూడా ప్లే ఆఫ్స్ చేరే అవకాశాలు ఉన్నాయి. లక్నో, ముంబై జట్లకు కాస్త కష్టమైనా అధికారికంగా ప్లే ఆఫ్స్ రేసులో ఉన్నాయి. ఇక ఆరంభంలో ఇబ్బంది పడ్డ చెన్నై సూపర్ కింగ్స్ ప్రస్తుతం దూకుడు మీద ఉంది. ప్లేయింగ్ ఎలెవెన్ సెట్ అవ్వడంతో పాటు నిలకడగా ఆడుతూ ప్లే ఆఫ్స్ రేసులోకి దూసుకొచ్చింది. మంగళవారం జరిగిన పోరులో ఢిల్లీ క్యాపిటల్స్‌పై నెగ్గిన చెన్నై సూపర్ కింగ్స్ పాయింట్ల పట్టికలో 6వ స్థానానికి చేరుకుంది. ప్రస్తుతం 10 మ్యాచ్‌ల్లో 5 విజయాలు.. 5 ఓటములతో 10 పాయింట్లు సాధించిన చెన్నై సూపర్ కింగ్స్ 6వ స్థానంలో నిలిచింది. ఇక ఈ మ్యాచ్‌లో సంజూ సామ్సన్ రెచ్చిపోయాడు. తద్వారా ఎవరికీ సాధ్యం కాని రికార్డును సాధించాడు. ఈ మ్యాచ్‌లో సంజూ సామ్సన్ 52 బంతుల్లో 87 పరుగులు చేసి అజేయంగా నిలిచాడు. ఇందులో 7 ఫోర్లు.. 6 సిక్సర్లు ఉన్నాయి. ఇప్పటికే రెండు సెంచరీలు బాదాడు. చెన్నై సూపర్ కింగ్స్ తరఫున తొలి సీజన్ ఆడుతున్న సంజూ సామ్సన్ ఆరంభంలో ఇబ్బంది పడ్డా.. ప్రస్తుతం సూపర్ ఫామ్‌లో ఉన్నాడు. సంజూ సామ్సన్ నిలబడి ఆడిన ప్రతిసారి కూడా చెన్నై గెలవడం విశేషం. ఇక ఢిల్లీతో జరిగిన పోరులో కార్తీక్ శర్మ (31 బంతుల్లో 41 నాటౌట్; 4 ఫోర్లు, 2 సిక్సర్లు)తో కలిసి అజేయమైన 3వ వికెట్‌కు 66 బంతుల్లో 114 పరుగులు జోడించాడు. ఈ క్రమంలో ఎవరికీ సాధ్యం కాని రికార్డును సాధించాడు. ఐపీఎల్ చరిత్రలో ఒకే సీజన్‌లో ఒకే జట్టుపై రెండుసార్లు 100 లేదా అంతకంటే ఎక్కువ భాగస్వామ్యాలు నెలకొల్పిన తొలి బ్యాటర్‌గా సంజూ సామ్సన్ చరిత్ర నెలకొల్పాడు. ఈ సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన తొలి అంచె పోరులో ఆయుశ్ మాత్రేతో కలిసి సంజూ సామ్సన్ 113 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పాడు. రుతురాజ్ గైక్వాడ్ కూడా ఢిల్లీపై రెండుసార్లు 100 లేదా అంతకంటే ఎక్కువ భాగస్వామ్యాలు నెలకొల్పాడు. అయితే అతడు రెండు సీజన్లలో ఈ ఘనత సాధించాడు.

# ఎప్పుడు ఎవరికి బౌలింగ్ ఇవ్వాలో నాకు బాగా తెలుసు: రోహిత్ శర్మ



మైదానంలోకి దిగితే పరుగులు వరద పారించే స్టార్ బ్యాటర్ రోహిత్ శర్మకు మతిమరుపు ఉంటుందని, విలువైన వస్తువులను సైతం మర్చిపోతుంటాడని తన టీమ్‌మేట్స్ ఇప్పటికే అనేక సందర్భాల్లో చెప్పారు. తాజాగా అతడి మతిపరుపు విషయం మరోసారి తెరపైకి వచ్చింది. అయితే తాను వస్తువులనే మర్చిపోతానని, గేమ్ స్ట్రాటజీని కాదని, ముఖ్యమైన విషయాలు కచ్చితంగా గుర్తుంటాయని అన్నాడు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.రోహిత్ శర్మ ప్రస్తుతం ఐపీఎల్‌లో బిజీగా ఉన్నాడు. ఈ క్రమంలో అతడు ముంబయి ఇండియన్స్ జట్టు సభ్యులు సూర్యకుమార్, తిలక్ వర్మ, రికెల్టన్, జస్ప్రీత్ బుమ్రా, విల్ జాక్స్‌కో కలిసి తాజాగా ఓ ఈవెంట్‌లో పాల్గొన్నాడు. ఈ ఈవెంట్‌లో రోహిత్ మతిమరుపుతో తాజాగా తనకు ఎదురైన సందర్భం గురించి యంగ్ బ్యాటర్ తిలక్ వర్మ షేర్ చేసుకున్నాడు. ఈసారి రోహిత్ ఫోన్ మర్చిపోయాడని చెప్పాడు. 'ఇటీవల మేం జామ్‌నగర్‌లోని వంతారకు వెళ్లాం. ఈ క్రమంలో రోహిత్ భయ్యా ఫ్యామిలీతోపాటు మాకంటే ముందే దిల్లీకి చేరుకున్నాడు. దీంతో నేను భయ్యాకు ఫోన్ చేస్తున్నా. కానీ లిఫ్ట్ చేయడం లేదు. అయితే నేను వంతారకు చేరుకున్నాక, 'ఫోన్ ఎందుకు లిఫ్ట్ చేయట్లేదు' అని తనను అడిగితే 'ఫోన్ ఇంట్లో మర్చిపోయి వచ్చాను' అని చెప్పాడని అన్నాడు. దీంతో ఈవెంట్‌లో ఒక్కసారిగా అంతా నవ్వేశారు.దీనిపై రోహిత్ స్పందించాడు. 'హా! నేను అప్పుడప్పుడు వస్తువులు మర్చిపోతుంటానని అంగీకరిస్తాను. ఇక్కడ కూర్చొని నవ్వుతున్నవాళ్లు కూడా ఎప్పుడో ఒక సందర్భంలో ఏదో ఒకటి మర్చిపోయే ఉంటారు. అది కామన్. కానీ, ఏ సందర్భంలో ఏది ముఖ్యమైన విషయమో అది నేను కచ్చితంగా గుర్తుపెట్టుకుంటాను. ఎప్పుడు ఎవరికి బౌలింగ్ ఇవ్వాలి ఎవరిని ఎప్పుడు బ్యాటింగ్‌కు పంపాలి అనే విషయాలు పక్కా గుర్తుంటాయి' అని రోహిత్ అన్నాడు. ముంబయి రీసెంట్‌హో వాంఖడే వేదికగా మ్యాచ్ ఆడింది. అయితే ఈ మ్యాచ్‌కు ముందు మైదానంలో రోహిత్ ప్రాక్టీస్ చేస్తుండగా, అతడు బాదిన ఓ బంతి అక్కడే పని చేస్తున్న గ్రౌండ్ స్టాఫ్‌కు తగిలింది. మోకాలికి బంతి బలంగా తాకడంతో గ్రౌండ్ స్టాఫ్ మెంబర్ అక్కడే కిందపడ్డాడు. దీంతో రోహిత్ ప్రాక్టీస్ మధ్యలోనే ఆపేసి అతడి వద్దకు వెళ్లి పరిస్థితిని కనుక్కున్నాడు.

# పాండ్యాను దూరం పెట్టిన ముంబై ఇండియన్స్!



ఐపీఎల్ 2026 సీజన్ ముంబై ఇండియన్స్‌కు జట్టుకు పీడకలగా మారింది. వారికి అసలు కలిసి రాలేదు. ఐదు సార్లు ఛాంపియన్‌గా నిలిచిన ఈ జట్టు, ప్రస్తుతం పాయింట్ల పట్టికలో 9వ స్థానానికి పడిపోయి అత్యంత దారుణమైన ప్రదర్శన ఇస్తోంది. ఈ కష్టకాలంలో జట్టును ముందుండి నడిపించాల్సిన కెప్టెన్ హార్దిక్ పాండ్యా చుట్టూ ఇప్పుడు వివాదాలు, సందేహాలు ముసురుకున్నాయి. తాజా సమాచారం ప్రకారం రాయ్‌పూర్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరుగనున్న కీలక పోరు కోసం ముంబై ఇండియన్స్ జట్టు విమానాశ్రయం నుంచి బయల్దేరగా అందులో హార్దిక్ పాండ్యా కనిపించలేదు. దీంతో ఆయనను ముంబై ఇండియన్స్ పక్కన పెట్టారా అనే అనుమానాలు కలుగుతున్నాయి. మే4న లక్నో సూపర్ జెయింట్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక పాండ్యా ఆడలేదు. ఆ సమయంలో అతనికి వెన్నునొప్పి ఉన్నట్టు జట్టు యాజమాన్యం అధికారికంగా ప్రకటించింది. హార్దిక్ స్థానంలో సూర్య కుమార్ యాదవ్ ఆ మ్యాచ్‌కు కెప్టెన్‌గా వ్యవహరించారు. అయితే బుధవారం ముంబై విమానాశ్రయం టెర్మినల్ 1 వద్ద జట్టు సభ్యులందరూ కనిపించినప్పటికీ , హార్దిక పాండ్యా మాత్రం వారిలో లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. అతను నేరుగా రాయ్‌పూర్‌లో జట్టుతో కలుస్తాడా లేదా అనే విషయంలో ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టత లేదు. క్రికెట్ వర్గాల్లో హార్దిక్ గైర్హాజరీపై కేవలం గాయం మాత్రమే కారణం కాకపోవచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. దీనికి ప్రధానంగా రెండు కారణాలు కనిపిస్తున్నాయి. ఈ సీజన్‌లో హార్దిక్ పాండ్యా బ్యాట్‌తో, బంతితో దారుణంగా విఫలమయ్యాడు. ఇప్పటి వరకు ఆడిన 8 మ్యాచ్‌లలో 146 పరుగులు మాత్రమే చేశాడు. అది కూడా స్ట్రైక్ రేట్ 136.45 ఉంది. బౌలింగ్‌లోనూ ప్రభావం చూపలేకపోయాడు. రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తప్పించి హార్దిక్ పాండ్యాను పీఠంపై కూర్చోబెట్టం ముంబై ఇండియన్స్‌కు ఇబ్బందిగా మారింది. జట్టు సమన్వయం దెబ్బతింది. హార్థిక్ గాయం గురించి ర్యాన్ రికెల్టన్ మాట్లాడుతూ.... అతనికి వెన్నునొప్పి ఉందని నాకు మధ్యాహ్నం తెలిసింది. అది ఎంత తీవ్రంగా ఉందో, అతను ఎప్పుడు తిరిగి వస్తాడో నాకు తెలియదు అని కామెంట్ చేశాడు. మే 6 మధ్యాహ్నం జట్టు సభ్యులు విమానాశ్రయానికి చేరుకున్న సమయంలో ఈ విషయం వెలుగు చూసింది.

# అభిషేక్- వైభవ్.. ఐపీఎల్ స్వరూపాన్నే మార్చేస్తారు

**• టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్**




ఇండియన్ ప్రీమియర్ లీగ్ జట్లలో గత కొన్ని సీజన్ల నుంచి బ్యాటింగ్ విధానం పూర్తిగా మారింది. 30-గజాల సర్కిల్ వెలుపల ఇద్దరు ఫీల్డర్ల నిబంధనను సద్వినియోగం చేసుకుంటూ, పవర్‌ప్లేలో పరుగులు రాబట్టడంలో జట్లు అసాధారణ దూకుడును ప్రదర్శిస్తున్నాయి. ఇది కొన్ని అద్భుతమైన స్కోర్‌లకు దారితీసింది. కొన్నిసార్లు ఓవర్‌కు 18 పరుగులు కూడా నమోదయ్యాయి. పవర్ ప్లే.. పేరుకు తగ్గట్టుగా ఓపెనర్లు దూకుడుగా ఆడుతున్నారు. ఈ పరిణామాలపై టీమిండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ స్పందించారు. కీలక వ్యాఖ్యలు చేశారు. పవర్ ప్లేలో భారీగా పరుగులు చేస్తేనే మ్యాచ్ గెలిచినట్లు భావించాల్సి వస్తోందని వ్యాఖ్యానించారు. అదే కంటిన్యూ అయితే ఐపీఎల్ టైటిల్ కూడా దక్కించుకోవచ్చని అభిప్రాయపడ్డారు. స్పోర్ట్స్‌స్టార్ 'ఇన్‌సైట్ ఎడ్జ్' పాడ్‌కాస్ట్‌లో ఆయన మాట్లాడారు. మొదటి ఆరు ఓవర్లలో వీలైనన్ని పరుగులు చేస్తేనే మ్యాచ్ గెలిచినట్టవుతోందని, ఈ విషయంలో ఎటువంటి గేమ్ ప్లాన్ కూడా పెద్దగా వర్కవుట్ కావట్లేదని పేర్కొన్నారు. పవర్ ప్లేలో బౌలర్లపై ఆధిపత్యం చెలాయిస్తే సులువగా మ్యాచ్ గెలిచినట్టేనని మంజ్రేకర్ తేల్చి చెప్పారు. అలా ఆడిన జట్టు చివరికి టైటిల్ గెలిచినా కూడా ఆశ్చర్యపోనక్లేదని, అంతా పవర్ ప్లే పైనే ఆధారపడి ఉందని ఆయన పేర్కొన్నారు.

# మెడల్ సాధించినా బ్యాడ్మింటన్‌కు గుర్తింపు లేదు

## భారత స్టార్ షట్లర్ సాత్విక్ నిరాశ!

2026 థామస్ కప్ టోర్నమెంట్‌లో కాంస్య పతకం సాధించినప్పటికీ తమకు తగిన గుర్తింపు దక్కలేదని భారత స్టార్ షట్లర్ సాత్విక్ సాయిరాజ్ ఆవేదన వ్యక్తం చేశాడు. ప్రతిష్ఠాత్మక టోర్నీలో పతకం సాధించి స్వదేశానికి వస్తే, ఎయిర్‌పోర్టులో కనీసం స్వాగతం కూడా లభించలేదని అన్నాడు. అభిమానులు ఎవరు కూడా స్వాగతం పలికేందుకు ఎయిర్‌పోర్టుకు రాకపోవడం తనను ఎంతో బాధించిందని సాత్విక్ అన్నాడు. అందుకే భవిష్యత్తులో తన పిల్లలను బ్యాడ్మింటన్ ఆడించనని తెలిపాడు.బ్యాడ్మింటన్‌కు గుర్తింపు లభించడం లేదని సాత్విక్ అభిప్రాయపడ్డాడు. దేశ ప్రజలు కూడా ప్రస్తుతం క్రికెట్ (ఐపీఎల్), రాజకీయాలపైనే ఎక్కువగా ఫోకస్ చేస్తున్నారని అన్నాడు. ఈ పరిణామాలు చూస్తుంటే, భారత్‌లో బ్యాడ్మింటన్ ఆటను ప్రొఫెషనల్ గేమ్‌గా చూడడం లేదా అనే సందేహం కలుగుతుందని అన్నాడు. ఈ మేరకు తాజాగా డెన్మార్క్ నుంచి భారత్‌కు వచ్చిన సాత్విక్ కీలక వ్యాఖ్యలు చేశాడు.'ఏడు గంటలు జర్నీ చేసి జర్మనీ నుంచి హైదరాబాద్ చేరుకున్నాం. మేం థామస్ కప్ జెర్సీలను ధరించి ఉన్నాం. అయినప్పటికీ జర్మనీ ఎయిర్‌పోర్ట్‌లో ఒక్కరు కూడా మీరెవరు ఆ పతకాలు ఏంటి అని కూడా మమ్మల్ని అడగలేదు. అక్కడ ఇండియన్స్, అందులో కొందరు మన తెలుగు వాళ్లు కూడా ఉన్నారు. అయితే ప్రస్తుతం అందరూ ఐపీఎల్, పాలిటిక్స్‌పైనే దృష్టి పెడుతున్నారు. వాటితోనే బిజీగా ఉన్నారు. మేం 2022లో గోల్డ్ మెడల్ తీసుకొచ్చాం. అప్పుడు కూడా ఇదే పరిస్థితి ఎదుర్కొన్నాం. కానీ ఇలాంటి గొప్ప విజయాలు సాధించినప్పుడు ఘనంగా సంబరాలు చేసుకోవాలని ఉంటుంది"ఇంకో విషయం ఏంటంటే, ఇక్కడ ఎయిర్‌పోర్టులో కూడా మమ్మల్సిన ఎవరూ గుర్తించలేదు. జట్టులోని ఆటగాళ్లు శ్రీరాంత్, ప్రణయ్, ధ్రువ్ ఇలా అందరూ ఎయిర్‌పోర్ట్‌కు రాగానే ఎవరి క్యాబ్ వాళ్లే బుక్ చేసుకుని వెళ్లిపోయారు. నాకోసం నా ఫ్రెండ్స్ వచ్చారు. స్టార్ అథ్లెట్లు కూడా క్యాబ్స్ బుక్ చేసుకుంటూ కనిపించారు. ప్రస్తుతం ఇలా ఉంది పరిస్థితి. కానీ సంబరాలు చేసుకునే అవకాశాలు తరచూ రావు. అది అభిమానులకు తెలియడం లేదు' అని సాత్విక్ అన్నాడు.' బ్యాడ్మింటన్ టోర్నీల్లో కాంపిటీషన్ తీవ్రంగా ఉంటుంది. ఇలాంటి




టోర్నీల్లో గాయపడితే, రిప్లేస్‌మెంట్‌గా ఆడేందుకు ఇంకో ప్లేయర్ ఉండడు. ముఖ్యంగా టీమ్ ఈవెంట్స్‌లో చాలా ఒత్తిడి ఉంటుంది. సపోర్ట్ కూడా ఉండదు. అయినప్పటికీ పతకాలు గెలిచినా గుర్తింపు ఉండడం లేదు. అందుకే ఫ్యూచర్‌లో 'నా పిల్లలను బ్యాడ్మింటన్ ఆడించను' అని ఓ సందర్భంలో ప్రణయ్ చెప్పాను. మెంటల్‌గా స్ట్రాంగ్‌గా ఉంటే ఫర్వాలేదు కానీ, ఎంత గొప్ప ప్రదర్శన చేసినా గుర్తింపు ఉండకపోతే చాలా బాధగా ఉంటుంది. ఎంత సాధించినా, హైదరాబాద్ అకాడమీలో కేక్ కట్ చేయడం వరకే సంబరాలు పరిమితమవుతున్నాయి'.



# నితిన్ కొత్త సినిమా మొదలైంది..


యంగ్ హీరో నితిన్ తన కొత్త సినిమాను నేడు లాంఛనంగా ప్రారంభించారు. ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లపై ఈ చిత్రం రూపొందనుంది. హైదరాబాద్‌లో జరిగిన పూజా కార్యక్రమాలతో ఈ ప్రాజెక్ట్‌ను వైభవంగా మొదలుపెట్టారు. ఈ కార్యక్రమానికి చిత్ర యూనిట్ సభ్యులు హాజరయ్యారు.

ఈ సినిమాతో సోము నర్రి అనే కొత్త దర్శకుడు టాలీవుడ్‌కు పరిచయం అవుతున్నారు. నితిన్ సరసన 'అశోకవనంలో అర్జున కళ్యాణం' ఫేమ్ రితికా నాయక్ కథానాయికగా నటిస్తోంది. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య ఈ చిత్రాన్ని సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ చిత్రానికి సురేష్ బొబ్బిలి సంగీతం అందించనున్నారు.

ప్రస్తుతం ప్రారంభోత్సవం జరుపుకున్న ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌ను ఈ నెల రెండో వారం నుంచి మొదలుపెట్టాలని చిత్ర బృందం ప్లాన్ చేస్తోంది. వరుస విజయాలతో జోరుమీదున్న సితార సంస్థ, ఈ చిత్రంతో నితిన్‌కు ఒక మంచి కమర్షియల్ హిట్ అందించాలని లక్ష్యంగా పెట్టుకుంది. త్వరలోనే సినిమా టైటిల్, ఇతర నటీనటుల పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటిస్తామని నిర్మాతలు తెలిపారు.

# కొత్త జానర్‌లో నారా రోహిత్..

## ఒక పోస్టర్‌తోనే హైప్




రీసెంట్ గా సుందరకాండ సినిమాతో వినోదభరితమైన ప్రదర్శన ఇచ్చిన ఆయన, ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. దీఎ: రాత్తీఝఝఅఱ ఌఝఎంష్ట్రఎఱ రాత్తీబఅస్త్రుతీఝజూబ । 6 మీఝఎ 2026 3:12ాావీ రాష్ట్రుతీవ: టాలీవుడ్‌లో కొత్త కాన్సెప్ట్‌లకు ప్రేక్షకుల నుండి వస్తున్న ఆదరణ మధ్య, యంగ్ హీరో రోహిత్ నారా తన కెరీర్‌ను మరింత వైవిధ్యంగా మలుచుకునే దిశగా ముందడుగు వేస్తున్నారు. రీసెంట్ గా సుందరకాండ సినిమాతో వినోదభరితమైన ప్రదర్శన ఇచ్చిన ఆయన, ఇప్పుడు మరో ఇంట్రెస్టింగ్ ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమవుతున్నారు. ఎ=చీ23 అనే వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమా ద్వారా రోహిత్ కొత్త జానర్‌లో తన సామర్థ్యాన్ని చూపించాలనే ప్రయత్నం చేస్తున్నట్టు తెలుస్తోంది. ముఖ్యంగా, డెబ్యూ డైరెక్టర్ చినిమిల్లి మణికుమార్‌తో ఆయన కాంబినేషన్ కుదరడం ఈ ప్రాజెక్ట్‌కు స్పెషల్ ఎట్రాక్షన్ గా నిలుస్తోంది. ఈ మూవీ అనౌన్స్‌మెంట్ పోస్టర్ రిలీజైన వెంటనే సోషల్ మీడియాలో చర్చకు దారి తీసింది. షౌటింగ్ సూన్ సరికొత్త ట్యాగ్‌లైన్‌తో వచ్చిన ఈ పోస్టర్, సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేసింది. సాధారణంగా టీజర్ లేదా ఫస్ట్ లుక్ ద్వారా హైప్ క్రియేట్ చేసే ట్రెండ్ మధ్య, కేవలం ఒక పోస్టర్ ద్వారానే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షించడం ఈ టీమ్ స్ట్రాటజీని ప్రత్యేకంగా నిలబెడుతోంది. పోస్టర్‌లో కనిపిస్తున్న కలర్ ఫుల్ డిజైన్ చూస్తుంటే ఇదొక ఫీల్ గుడ్ ఎంటర్టైనర్ అనే సిగ్నల్స్ ను ఇస్తోంది. దీంతో, కథలో ఎమోషన్‌తో పాటు ఎంటర్టైన్‌మెంట్‌కు కూడా సమాన ప్రాధాన్యం ఉంటుందని అంచనాలు పెరుగుతున్నాయి. ఈ ప్రాజెక్ట్‌ను కరణ్ సి ప్రొడక్షన్స్ ాూూ బ్యానర్‌పై భరత్ చౌదరి నిర్మిస్తున్నారు. కొత్త డైరెక్టర్ తో సినిమా చేయడం ఒక రిస్క్ అయినప్పటికీ, కంటెంట్‌పై నమ్మకంతోనే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. టాలీవుడ్‌లో రీసెంట్ గా కొత్త దర్శకులు వినూత్న కథలతో మంచి విజయాలు సాధిస్తున్న నేపథ్యంలో, కూడా ఆ జాబితాలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇక రోహిత్ నారా కెరీర్ పరంగా చూస్తే, ఇదొక కీలక మలుపుగా మారవచ్చని సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. త్వరలోనే శుభ ముహూర్తంతో ఈ సినిమా షూటింగ్ ప్రారంభం కానుంది. షూటింగ్ మొదలయ్యాక ఇతర నటీనటులు, టెక్నికల్ టీమ్ వివరాలను వెల్లడించనున్నట్లు సమాచారం. ప్రస్తుతం టైటిల్ కూడా ఫిక్స్ కాలేదు కాబట్టి, టీమ్ ప్లానింగ్ దశలోనే ప్రేక్షకుల్లో ఆసక్తి రేకెత్తించడం గమనార్హం. మొత్తానికి, ఎ=చీ23 ఒక సాధారణ సినిమా ప్రకటనగా కాకుండా, కంటెంట్ ఆధారంగా హైప్ సృష్టించే కొత్త ట్రెండ్‌కు నాంది పలికే ప్రాజెక్ట్‌గా కనిపిస్తోంది. మరి ఈ సినిమాతో నారా రోహిత్ ఆడియన్స్ ను ఏ మేర ఆకట్టుకుంటారో చూడాలి.

# నేహా శెట్టి అందాల వర్షం..



'డీజే టిల్లు' సినిమాతో యూత్ గుండెల్లో 'రాధిక'గా ముద్ర వేసుకున్న నేహా శెట్టి, తన గ్లామర్‌తో నెటిజన్లను మెస్మరైజ్ చేస్తోంది. తాజాగా మాల్దీవుల సముద్ర తీరాన వైట్ డ్రెస్‌లో మెరిసిపోతూ కొన్ని క్రేజీ ఫోటోలను షేర్ చేసింది. "కాట్ ఏ వైబ్ బై ది సీ" అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్, ఆ ఫోటోల్లోని ఆమె స్టైలిష్ లుక్ ఇప్పుడు ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నాయి. అవకాశాల కోసం ఎదురుచూస్తున్నా, సోషల్ మీడియాలో మాత్రం నేహా తన క్రేజ్‌ను అస్సలు తగ్గించుకోవడం లేదు. ఆ విశేషాలు చూద్దాం

వేసవి తాపాన్ని తగ్గించడానికి నేహా శెట్టి సముద్ర తీరాన్ని ఎంచుకుంది. ఈ ఫోటో షూట్‌లో ఆమె ధరించిన తెల్లటి డ్రెస్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 'స్టిచ్డ్ అల్మారీ' అనే బ్రాండ్ రూపొందించిన ఈ కస్టమ్ మేడ్ అవుట్‌ఫిట్‌లో నేహా ఎంతో అందంగా కనిపిస్తోంది. ఇక కట్-అవుట్ డిజైన్, కింద వైపు సముద్ర అలల కదలికలను తలపించేలా ఉన్న ఫ్రింజ్డ్ హెమ్ లైన్ ఆమెకు పక్కా రిసార్ట్ వేర్ లుక్‌ను ఇచ్చాయి. ఈ డ్రెస్ నేహా బాడీ లాంగ్వేజ్‌కు సరిగ్గా నప్పింది. 'రాధిక'గా గుర్తింపు.. ఆపై ఒడిదుడుకులు: ఆకాష్ పూరి 'మెహబూబా' సినిమాతో టాలీవుడ్ ఎంట్రీ ఇచ్చిన నేహాకు, అసలైన గుర్తింపు ఇచ్చింది మాత్రం సిద్ధు జొన్నలగడ్డ సరసన నటించిన 'డీజే టిల్లు' చిత్రమే. ఇక అందులో రాధిక పాత్ర ఎంత పాపులర్ అయ్యిందో మనందరికీ తెలిసిందే. ఆ తర్వాత కొన్ని సినిమాల్లో నటించినా, అవి ఆశించిన స్థాయిలో సక్సెస్ కాలేదు. దీంతో ఈ అమ్మడికి మెల్లగా అవకాశాలు తగ్గాయి. అయితేనేం, సోషల్ మీడియా ద్వారా నిరంతరం ఫ్యాన్స్‌కు టచ్‌లోనే ఉంటూ తన గ్లామర్ పవర్ చూపిస్తోంది.

నేహా శెట్టికి పవన్ కళ్యాణ్ మోస్ట్ అవేటెడ్ మూవీ 'ఓజీ'లో ఒక స్పెషల్ సాంగ్ చేసే అవకాశం వచ్చింది. అయితే అక్కడ ఆమెకు బ్యాడ్ లక్ వెంటాడింది. ఇక సినిమా లెంగ్త్ ఎక్కువ కావడంతో ఎడిటింగ్‌లో నేహా చేసిన స్పెషల్ సాంగ్‌ను చిత్ర యూనిట్ తొలగించాల్సి వచ్చింది. ఆ తర్వాత ఆ పాటను యూట్యూబ్‌లో విడుదల చేసినప్పటికీ, సినిమాలో ఉంటే వచ్చే ఆ క్రేజ్ మాత్రం రాలేదు. ఇక అయినప్పటికీ నేహా నిరాశ చెందకుండా తన ప్రయత్నాలు కొనసాగిస్తోంది. సరైన బ్రేక్ కోసం ఎదురుచూపులు: ప్రస్తుతం నేహా శెట్టి టాలీవుడ్‌లో ఒక మంచి హిట్ కోసం ఎదురుచూస్తోంది. తనలోని నటనను, గ్లామర్‌ను ప్రూవ్ చేసుకునే అవకాశం వస్తే మళ్ళీ ఫామ్‌లోకి రావాలని ఆశిస్తోంది. అందుకే ఎప్పటికప్పుడు సరికొత్త ఫోటో షూట్లతో మేకర్స్ దృష్టిని ఆకర్షిస్తోంది. ఇక తాజాగా ఆమె పంచుకున్న ఈ బీచ్ ఫోటోలకు నెటిజన్లు "రాధికా.. అదిరిపోయావ్", "బ్యూటిఫుల్ వైబ్" అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు. గ్లామర్ విషయంలో నేహా శెట్టికి పోటీ ఇచ్చేవారు తక్కువనే చెప్పాలి.

# జన నాయగన్ ఊపిరి పీల్చుకో

దళపతి విజయ్ తమిళనాడు సీఎం పీఠాన్ని దక్కించుకోవడంతో -జన నాయగన్- ఊపిరి పీల్చుకుంటుందా? అష్టదింగ్భందనానికి గురైనా జన నాయగన్ దిగ్భందనాన్ని తొలగించుకుని బయటకు రాబోతుందా? అంటే అవుననే అనాలి. గత కొంతకాలంగా -జన నాయగన్- విడుదల విషయంలో రకరకాల రాజకీయ, న్యాయ పరమైన, సాంకేతిక సమస్యలు ఎదురైన సంగతి తెలిసిందే. తాజాగా స్వయంగా కథానాయకుడే రాష్ట్ర పాలనా పగ్గాలు చేపట్టడంతో ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సందడి చేయడానికి మార్గం సుగమం అవుతుందని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. -జన నాయగన్- సినిమా గత ఏడాదే రిలీజ్ అవ్వాలి. కానీ అందులోని కొన్ని రాజకీయ అంశాలు , డైలాగులు అప్పటి ప్రభుత్వాలకు కంటగింపుగా మారాయనే ప్రచారం జరిగింది. సెన్సార్ బోర్డు దగ్గర నుండి థియేటర్ల కేటాయింపు వరకు సినిమా అడుగడుగునా ఎన్నో సవాళ్లను ఎదుర్కొంది.

సినిమా పేరులోనే -ప్రజా నాయకుడు- అనే అర్థం ఉండటం అది విజయ్ రాజకీయ ఆకాంక్షలను ప్రతిబింబించేలా ఉండటంతో అప్పట్లో ఈ చిత్రాన్ని అడ్డుకునే ప్రయత్నాలు జరిగాయని అభిమానులు ఆరోపించారు. తాజాగా తమిళనాడు ముఖ్యమంత్రిగా విజయ్ బాధ్యతలు చేపట్టడం సినిమాకు అతిపెద్ద ప్లస్ పాయింట్‌గా మారింది. సినిమా విడుదలకు కావాల్సిన అనుమతులు, పంపిణీ వ్యవస్థలో ఉండే ఇబ్బందులు అత్యంత వేగంగా క్లియర్ అయ్యే అవకాశం ఉంది. ముఖ్యమంత్రి హోదాలో ఉన్న వ్యక్తి సినిమా అంటే సహజంగానే అంచనాలు ఆకాశంలో ఉంటాయి. గతంలో ఎన్టీఆర్, ఎంజీఆర్ వంటి దిగ్గజాలు కూడా రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత వారి సినిమాలు సంచలనాలు సృష్టించాయి. తాజాగా విజయ్ విషయంలోనూ అదే పునరావృతమయ్యేలా కనిపిస్తోంది. దీంతో ఈ సినిమా విడుదల తేదీపై కోలీవుడ్‌లో ఆసక్తికర చర్చ నడుస్తోంది. విజయ్ రాజకీయ విజయానికి గుర్తుగా లేదా ఆయన పాలనలో తీసుకునే కీలక నిర్ణయాలకు అనుగుణంగా ఓ ప్రత్యేకమైన రోజున జన నాయగన్ ను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్మాతలు ప్లాన్ చేసే అవకాశం లేకపోలేదు. ఈ చిత్రం ద్వారా ఆయన చెప్పాలనుకున్న సామాజిక సందేశం ఇప్పుడు నేరుగా ప్రజల్లోకి వెళ్తుందని ఇది ఆయన రాజకీయ ప్రయాణానికి కూడా మరింత బలాన్ని ఇస్తుందని పార్టీ శ్రేణులు భావిస్తున్నాయి కేవలం తమిళనాడులోనే కాకుండా విజయ్‌కున్న గ్లోబల్ మార్కెట్‌ను దృష్టిలో ఉంచుకుని ఈ సినిమాను భారీ స్థాయిలో విడుదల చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సినిమాకున్న అడ్డంకులు తొలగిపోవడమే కాకుండా ప్రభుత్వ మద్దతు కూడా పరోక్షంగా ఉండే అవకాశం ఉండటంతో థియేటర్ల సంఖ్య రికార్డు స్థాయిలో పెరుగుతాయి. -జన నాయగన్- విడుదలైతే ఇదొక సినిమా మాత్రమే అవ్వదు. ఒక నాయకుడి విజయోత్సవంగా మిగిలిపోతుందని ఫ్యాన్స్ సంబర పడుతున్నారు. కోర్టు వివాదంలో ఉన్న ఈ సినిమా అక్కడా వేగంగానే క్లియరెన్స్ తెచ్చుకునే అవకాశం ఉంది. ఇక -జన నాయగన్- చిత్రానికి కాలం కలిసొచ్చిందనే చెప్పాలి. ఎన్ని అడ్డంకులు ఎదురైనా సరైన సమయం వచ్చినప్పుడు విజయం దానంతట అదే వస్తుందనే దానికి ఈ సినిమానే ఉదాహరణ. విజయ్ ముఖ్యమంత్రి కావడంతో ఈ సినిమాకు ఉన్న క్రేజ్ రెట్టింపు అయింది. త్వరలోనే వెండితెరపై -జన నాయగన్- సందడి మొదలు కానుంది. ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద ఏ స్థాయి రికార్డులను తిరగరాస్తుందో చూడాలి.



# 'మైసా' కీలక షెడ్యూల్ పూర్తి.. గిరిజన యువతిగా రష్మిక!

స్టార్ హీరోయిన్ రష్మిక మందన్న తన రాబోయే చిత్రం 'మైసా'కు సంబంధించి కీలక షెడ్యూల్ పూర్తి చేశారు. రవీంద్ర పుల్లే దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమా కోసం కేరళలో జరిగిన సుదీర్ఘ షెడ్యూల్ తాజాగా ముగిసింది. ఈ విషయాన్ని రష్మిక తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్ ద్వారా అభిమానులతో పంచుకున్నారు. తన టీమ్‌తో కలిసి దిగిన ఒక చిన్న వీడియోను పోస్ట్ చేసి, ప్రాజెక్ట్ కోసం కష్టపడి పనిచేస్తున్న వారికి ధన్యవాదాలు తెలిపారు.

ఈ సినిమాలో రష్మిక మొదటిసారిగా ఒక గిరిజన గోండు యువతి పాత్రలో కనిపించనున్నారు. ఇందులోని హై-ఆక్టేన్ యాక్షన్ సన్నివేశాల కోసం ఆమె థాయ్‌లాండ్‌లోని బ్యాంకాక్‌లో ప్రత్యేక శిక్షణ తీసుకున్నట్లు సమాచారం. అక్కడ రోజూ 8 గంటలకు పైగా కఠినమైన శిక్షణ పొందినట్లు తెలుస్తోంది. యాక్షన్-ప్యాక్డ్ షెడ్యూల్‌ను విజయవంతంగా పూర్తి చేసినట్లు చిత్రబృందం పేర్కొంది. 'మైసా' చిత్రంలో ఈశ్వరి రావు, గురు సోమసుందరం, రావు రమేష్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాతో పాటు రష్మిక మరిన్ని క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. షాహిద్ కపూర్, కృతి సనన్‌లతో కలిసి 'కాక్‌టెయిల్ 2'లో నటిస్తున్నారు. ఇది ఈ ఏడాది జూన్ 19న విడుదల కానుంది. అలాగే విజయ్ దేవరకొండతో కలిసి 'రణబాలి' అనే పీరియడ్ డ్రామాలో




Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613